
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 18 మార్చి 2025

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

● జాయింట్ కలెక్టర్ అదితిసింగ్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అర్జీదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా సభవన్‌లో జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై తమ సమస్యలను జాయింట్ కలెక్టర్‌కు, అధికారులకు మొరపెట్టుకున్నారు. అర్జీదారుల వినతులను స్వీకరిస్తూ తదుపరి చర్యలకై సంబంధిత అధికారులను పిలిచి అక్కడికక్కడే లేదంటే సత్వరమే సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశతో బాధితులు అర్జీలు సమర్పిస్తుంటారన్నారు. అలాంటి అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, విచారణ చేసి, పారదర్శకంగా పరిష్కారాలు అందించాలని ఆదేశించారు. అర్జీదారుడు తృప్తి పడేలా పరిష్కారం ఉండాలన్నారు. తొలుత జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పీజీఆర్ఎస్ దరఖాస్తులపై ఆయా అధికారులతో సమీక్షించారు. కడప నిజాంనగర్‌కు చెందిన దివ్యాంగ యువకుడు బాబ్జీ జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూ తనకు 2004లో రోడ్డు ప్రమాదంలో కాలు పోయిందన్నారు. తనకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. మైదుకూరులోని మాధవ ఆంజనేయులస్వామి గుడికి చెందిన సర్వే నెంబరు 1052-బీలో 40 సెంట్లు కబ్జాకు గురైందని, అక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా బిల్డింగ్ నిర్మిస్తున్నారని చర్యలు తీసుకోవాలని రాజారెడ్డి కోరారు.

న్యాయం జరగలేదంటూ..

కలెక్టరేట్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం

7

ప్రారంభమైన పది పరీక్షలు

● తొలిరోజు 99 శాతం మంది హాజరు





పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు, మీడియాతో మాట్లాడుతున్న డీఈవో షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు 99శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 161 కేంద్రాలను ఏర్పాటుచేశారు. 27,800 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 27,648 మంది హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులకు సంబంధించి 61 మంది హాజరుకావాల్సి ఉండగా 50 మంది హాజరై పది మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 54 కేంద్రాలను పరిశీలించాయి. జిల్లా పరీక్షల పరిశీలకులు బి.మధుసూదన్‌రావు మూడు కేంద్రాలను పరిశీలించారు. జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ కడప నగరంలో ఆరు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఎక్కడైనా ఇబ్బందికరమైనవి జరిగితే తమ దృష్టికి తీసుకువస్తే తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు.

ఇక వైఎస్సార్ కడప జిల్లా

● జిల్లా పేరులో కడప చేరుస్తూ కేబినెట్ నిర్ణయం
● జిల్లా వాసుల హర్షం

(కడప-ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలోనే కడపకు ఎంతో పేరుప్రఖ్యాతులు ఉన్నాయి. క్రీస్తుశకం 1808లో కడప జిల్లా ఏర్పాటైంది. అయితే దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ఉమ్మడి ఏపీలో అప్పటి కాంగ్రెస్ గవర్నమెంటు ఆయన జ్ఞాపకార్థం 2010 జూలై 8న వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ నిర్ణయం తీసుకుంది. జగన్ సర్కారు వచ్చిన తరువాత పేరులో కడపను తొలగించి వైఎస్సార్ జిల్లాగా నామకరణం చేశారు. దీన్ని జిల్లావాసులు సహించలేకపోయారు. ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా పేరు మార్చారంటూ తెలిపారు. వైసీపీ మినహా పార్టీలకతీతంగా కడప జిల్లా పేరు మార్చడాన్ని వ్యతిరేకించాయి. కమ్యూనిస్టులు, ఇతర పార్టీలు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించడంతో పోస్టుకార్డు ఉద్యమం కూడా చేపట్టారు. అయితే జగన్ సర్కారు అవేమీ పట్టించుకోలేదు.



దేవుని కడప ఆలయం

కడప జిల్లా ఎంతో ప్రాచీనమైనది. కలియుగ దైవం వెంకటేశ్వరుని తొలిగడప కడప. వాగ్గేయకారుడు అన్నమయ్య నడిచిన నేల.. కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మంగారు, కవయిత్రి మొల్ల ఇలా ఎందరో జిల్లావారే. ఇక సిద్దవటం కోట, గండికోటతో ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉంది. ఇంతటి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉన్న జిల్లా పేరును జగన్ హయాంలో వైఎస్సార్‌గా మార్చారు. జిల్లా పేరులో కడప చేర్చాలంటూ ఎంతమంది ఎన్ని రకాలుగా మొరపెట్టుకున్నా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం జిల్లా పేరును వైఎస్సార్ కడపగా మరుస్తూ నిర్ణయం తీసుకోవడంతో అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేబినెట్ నిర్ణయం హర్షణీయం



కడప ఎంతో ప్రసిద్ధిగాంచింది. జిల్లాకు ఎంతో చరిత్ర ఉంది. వెంకటేశ్వరుడి తొలి గడప ఇదే. సిద్దవటం కోట, గండి కోట, అమీన్‌పీర్ దర్గా ఇక్కడే ఉన్నాయి. వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మార్చాలని ఎప్పటి నుండో డిమాండ్ ఉంది. వైఎస్‌పై అభిమానంతో ఆయన పేరును తొలగించకుండా వైఎస్సార్ కడపగా పేరు మారుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయం.


- ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యుడు

సత్యకుమార్ లేఖతో ...



కడప జిల్లాగా మార్చాలంటూ కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా పలువురు డిమాండ్ చేశారు. గత ఏడాది అక్టోబరు 4న జిల్లా పేరును వైఎస్సార్ కడపగా మార్పు చేయాలంటూ మంత్రి సత్యకుమార్ యాదవ్ చంద్రబాబుకు లేఖ రాశారు. గొప్ప చారిత్రక నేపథ్యం, ఆధ్యాత్మిక వారసత్వం ఉన్న కడప పేరును గత ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో వైఎస్సార్ జిల్లాగా మార్చిందని ఆ లేఖలో పేర్కొన్నారు. పేరు మార్పుతో ఎంతోమంది నొచ్చుకున్నా అప్పట్లో భయంతో ఎవరూ అడ్డు చెప్పలేకపోయారని ఇప్పటికైనా జిల్లా పేరు మార్చాలంటూ లేఖ రాశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్‌ను సమగ్ర నివేదిక కోరింది. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి ఇటీవల నివేదిక పంపించారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం సీఎం చంద్రబాబుతో జరిగిన కేబినెట్‌లో భేటీలో వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ తీర్మానం చేశారు. దీంతో జిల్లావాసుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

కడప చేర్చడం మంచి నిర్ణయం



తిరుమల వెంకటేశ్వరుడి తొలి గడప అయిన జిల్లా పేరులో కడప చేర్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం. ఎంతో ప్రాశస్త్యం, చరిత్ర కలిగిన జిల్లాకు కడప పేరు తొలగించడం బాధాకరం. కడప పేరు చేర్చాలంటూ పోరాడుతున్నాం. జిల్లా అభివృద్ధిపై వైఎస్ ఎనలేని అభివృద్ధి మార్కు ఉంది. ఆయన జ్ఞాపకార్థం వైఎస్సార్ కడపగా మార్చడం మంచి పరిణామం.

- ఎన్.తులసిరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి

వైఎస్సార్ పులివెందులగా పెట్టుకోండి



కడపకు ఎంతో ఘన చరిత్ర ఉంది. అన్నమయ్య, భక్త కన్నప్ప, బ్రహ్మంగారు తదితర మహామహులు నడయాడిననేల. అలాంటి కడప జిల్లా పేరును జగన్ ప్రభుత్వం వైఎస్సార్ జిల్లాగా మార్చింది. కడప జిల్లాగా కొనసాగించాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నాం. రాజశేఖర్‌రెడ్డిపై అంత అభిమానం ఉంటే ఆయన సొంతూరికి వైఎస్సార్ పులివెందులగా పేరు పెట్టుకోవాలి.

- ఎస్.గోవర్ధన్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

కడపగానే కొనసాగించాలి

జిల్లాలకు దేశం కోసం ప్రాణాలు అర్పించినవారి పేర్లను పెట్టుకోవచ్చు. వైఎస్ జిల్లాకు చేసింది శూన్యం. జగన్ హయాంలో అంతా వైఎస్ మయం చేశారు. రిమ్స్‌లో వైఎస్సార్ వైద్య ఆరోగ్యాలయం, వైఎస్సార్ స్టేడియం, వైఎస్సార్ విగ్రహాలు.. ఇలా జిల్లా అంతా కబ్జా చేసి వైఎస్సార్‌గా మార్చుకున్నారు. జిల్లా పేరును కడపగానే కొనసాగించాలి.

- జంగిటి వెంకటసుబ్బారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కడపకు 200 ఏళ్ల చరిత్ర



200 ఏళ్ల చరిత్ర కలిగిన కడపకు జగన్ ప్రభుత్వం కడప పేరు లేకుండా చేసి వైఎస్సార్ జిల్లాగా మార్చింది. కడపను కొనసాగించాలంటూ అఖిల పక్ష సమావేశం నిర్వహించాం. పోరాటం చేశాం. అయితే అప్పుడు పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వైఎస్సార్ కడప జిల్లాగా మార్చడం హర్షణీయం.

- గాలి చంద్ర, సీపీఐ జిల్లా కార్యదర్శి

ఒబెరాయ్ విలాస్‌తో 1500 ఉద్యోగాలు

(కడప-ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని దిగువపట్నం గ్రామంలో ఒబెరాయ్ గ్రూపునకు చెందిన ఒబెరాయ్ విలాస్‌తో 1500 మందికి ఉద్యోగాలు రానున్నాయి. గండికోటలో పర్యాటకుల తాకిడి ఎక్కువైంది. అయితే ఇక్కడ సరైన వసతులు లేవు. దీంతో ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఒబెరాయ్ సంస్థ ఇక్కడ 50 ఎకరాల్లో రిసార్ట్స్ నిర్మించనుంది. ఈ మేరకే వీరికి ప్రభుత్వం గతంలోనే స్థలాన్ని కేటాయించింది. అయితే అక్కడ కాకుండా మరోచోట ఏర్పాటు చేయాలని ఒబెరాయ్ నిర్వాహకులు ఇటీవల కోరారు. ఈ మేరకు వీరికి స్థలాన్ని రీ అలైన్‌మెంట్ చేస్తూ ఈ నెల 13న పెట్టుబడి ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) నిర్ణయం తీసుకుంది. ఆ ప్రాతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. దీంతో ఇక్కడ ఏర్పాటు కాబోయే ఒబెరాయ్ విలాస్‌తో 1500 మందికి ఉద్యోగాలు రావడంతో పాటు గండికోట పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందనుంది.

వైవీయూ ఇన్‌చార్జి వీసీగా అల్లం శ్రీనివాసరావు


● ప్రస్తుత వీసీ రాజీనామాకు గవర్నర్ ఆమోదం



కలికిరి / కడప ఎడ్యుకేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్శిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా అల్లం శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. గవర్నర్ ఆమోదం మేరకు సోమవారం ఈ నోటిఫికేషన్ జారీ అయింది. కాగా గత నెల 18న ఫణితి ప్రకాశ్‌బాబు వైవీయూ వీసీగా నియమితులయ్యారు. తాజాగా ఆయన తన పదవికి రాజీనామా సమర్పించారు. తనను పుదుచ్చేరి వైస్ చాన్సలర్‌గా రాష్ట్రపతి నియమించారని, ఈ నేపథ్యంలో తాను యోగి వేమన వీసీ పదవికి చేస్తున్న రాజీనామాను ఆమోదించాలని ఈ నెల 6న ప్రకాశ్‌బాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో వీసీ రాజీనామా లేఖను గవర్నర్ ఆమోదించినట్లు పేర్కొంటూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. అదే విధంగా ఆయన స్థానంలో నెల్లూరు విక్రమసింహపురి వర్శిటీ వీసీ అల్లం శ్రీనివాసరావును యోగివేమన వర్శిటీకి ఇన్‌చార్జి వీసీగా నియమిస్తున్నట్లు కోన శశిధర్ సోమవారం విడిగా మరో ఉత్తర్వు జారీ చేశారు.

విద్యుత్ బాదుడు

● భారీగా పెరిగిన విద్యుత్ బిల్లులు ● లబోదిబోమంటున్న వినియోగదారులు





భారీగా వచ్చిన విద్యుత్ బిల్లు

ఎర్రగుంట్ల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో పెంచిన విద్యుత్ బిల్లుల బాదుడు ఇప్పుడు సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నాయి. ఎప్పుడో కాల్చిన విద్యుత్‌కు నేడు ఇంధన మరియు వ్యయ కొనుగోలు సర్దుబాటు చార్జి (ఎఫ్‌పీపీసీఏ) పేరుతో వస్తున్న బిల్లులు ప్రజలకు భారీ షాక్ ఇస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టిన ట్రూ అప్ చార్జెస్‌తో ఇప్పటికీ వస్తున్న బిల్లులు కట్టేందుకే ప్రజలు అష్టకష్టాలు పడు తున్నారు. దానికి తోడు 2022, 2023, 2024 ఆర్థిక సంవత్సరాల్లో కాల్చిన విద్యుత్ ఎఫ్‌పీపీసీఏ చార్జెస్ నేడు వరుసగా రావడంతో విద్యుత్ బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. ముఖ్యంగా పేద మధ్యతరగతుల ప్రజల నడ్డివిరిచే విధంగా ఈ బిల్లులున్నాయని అంటున్నారు.

ఇన్ని అదనపు చార్జీలా...

విద్యుత్ వినియోగదారునికి వచ్చే విద్యుత్ బిల్లులో ఎనర్జీ చార్జెస్‌తో పాటు ఫిక్స్‌డ్ చార్జెస్, సర్‌చార్జెస్, ఎలక్ట్రిసిటీ డ్యూటీకి తోడు ట్రూఅప్ చార్జెస్, మూడు సంవత్సరాలకు సంబంధించిన నాలుగు నెలల విద్యుత్ సర్దుబాటు చార్జెస్.. ఇలా అసలు కన్నా కొసరు చార్జీలు అధికంగా ఉన్నాయి. ఇన్ని చార్జీలు వినియోగదారునిపై వేయడంతో భరించలేని పరిస్థితి నెలకొంది.

అద్దె ఇళ్ల పరిస్థితి ఘోరంగా...

అద్దె ఇళ్ల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. ఎప్పుడో మూడేళ్ల క్రితం వాడిన విద్యుత్ బిల్లు ప్రస్తుతం ఇస్తున్నారు. గతంలో అద్దెకున్న వారు ఎప్పుడో ఖాళీ చేసి వెళ్లి ఉంటారు. ప్రస్తుతం ఉన్న వారు ఇంత కరెంటు కాల్చలేదని బిల్లులు మేమెందుకు కడతామని యజమానులతో వాగ్వాదానికి దిగుతున్నారు. యజమానులు తమకు సంబంధం లేదని విద్యుత్ అధికారులపై నెట్టేస్తున్నారు. తమ చేతుల్లో ఏమీ లేదని అంతా ఏపీఈఆర్‌సీ ఆదేశాల మేరకు జరుగుతోందని అంటూనే.. బిల్లులు కట్టకపోతే కనెక్షన్ కట్ చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇక విద్యుత్ బిలు ్లల షాక్‌లకు వ్యాపారులు, చిన్నపరిశ్రమల యజమానులు, గనుల యజమానులు, దుకాణ దారులు కుదేలవుతున్నారు. ముఖ్యంగా నాప రాయి పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూప తోంది.

మా పరిధిలో లేదు

గతంలో వినియోగించిన విద్యుత్‌కు సంబంధించిన ఇంధన సర్దుబాటు చార్జీలు ఆయా నెలల విద్యుత్ వాడకాన్ని బట్టి ప్రస్తుత బిల్లులో కలుపుతున్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిటీ నేతృత్వంలో జరుగుతోంది. మా పరిధిలో ఏమీ లేదు.

- కిరణ్‌కుమార్, ఏడీఈ

రెట్టింపు బిల్లులు



మార్చి నెలలో కరెంటుబిల్లు రెట్టింపు వచ్చింది. ప్రతినెలా రూ.1200వరకు వచ్చేది. మార్చి బిల్లు ఒకేసారి రూ.2441 వచ్చింది. అసలే వ్యాపారాలు జరగక ఇబ్బందుల్లో ఉన్నాము. సర్దుబాటు పేరుతో పెంచిన చార్జీలను వెంటనే తగ్గించి ఆదుకోవాలి.

- రామలింగయ్య, చిల్లరకొట్టు వ్యాపారి

కోట్లు వెచ్చించినా.. అద్దెభవనాలే గతి..!

● రూ.36 కోట్లతో పనులు ప్రారంభం
● రూ.30 కోట్ల పనులు పూర్తి
● బిల్లులు రాక ఆగిన నిర్మాణాలు



పులివెందుల వద్ద అద్దె భవనాల్లో సాగుతున్న గురుకుల పాఠశాల



తొండూరు వద్ద దాదాపు 90 శాతం పూర్తయిన గురుకుల పాఠశాల భవనాలు

పులివెందుల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గం తొండూరు మండలంలో మహాత్మా జ్యోతిబాఫూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షే మ గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలను 2021లో అప్పటి వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. తొండూరులో సరైన వస తులతో కూడిన భవనాలు లేవనే కారణంతో దీనిని వేంపల్లెలో ప్రారంభిం చారు. అక్కడ రెండేళ్ల పాటు కొనసాగించారు. అనంతరం పులివెందుల సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలకు సంబంధించిన అద్దెగదుల్లోకి మార్చారు. ప్రస్తుతం ఇక్కడే చాలీచాలని వసతులతో విద్యా ర్థులు ఇబ్బందులు పడుతున్నా రు. కానీ ప్రభుత్వం 2022 మే నెలలో తొండూరు-మల్లేల సమీ పంలో రూ.36కోట్లతో నిర్మించేందుకు నిధులు విడుదల చేసింది. ఈ పనులను ఓ ప్రైవేటు సంస్థ ప్రారంభించింది. దాదాపు రూ.30కోట్ల మేర పనులు పూర్తి చేశారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో బిల్లులు మంజూరు కాలేదు. దీనితో కాంట్రాక్టర్ ఏడాదిగా పనులు ఆపేశారు. ఇప్పటికే ఆర్డీవో, కలెక్టర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అద్దె గదుల్లో సాగుతున్న పాఠశాలను సందర్శించారు. డిసెంబరులో బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కూడా పెండింగ్ బిల్లులపై చర్చ జరిగినా ఇంత వరకు మంజూరు కాలేదని తెలిసింది.

చాలీచాలని గదుల్లో విద్యార్థులు

తొండూరు గురుకుల పాఠశాల, జూని యర్ కళాశాల పక్కా భవనాల నిర్మాణం పనులు 2022 మే నెలలో ప్రారంభించారు. ఈ క్యాంపస్‌లో స్కూల్ భవనం, హాస్టల్ భవనం, కిచెన్ కమ్ డైనింగ్, క్వార్టర్స్, ప్రిన్సిపాల్ క్వార్టర్ ఇలా ఐదు భవనాలు నిర్మించాల్సి ఉంది. ఇందులో హాస్టల్ భవనం మినహా మిగిలినవన్నీ 90 నుంచి 95శాతం పనులు పూర్తయ్యాయి. దాదాపు రూ.30కోట్ల పనులు పూర్తయ్యాయి. అందులో రూ.12కోట్ల మేర బిల్లులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని ఓ అధికారి పేర్కొన్నారు. ఇక్కడ దాదాపు 500 మంది విద్యార్థులు 5వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు చదువుకోనున్నారు. పనులు చివరి దశలో ఆగిపోయాయి. పనుల పెండింగ్ కారణంగా విద్యార్థులు అద్దె భవనాల్లో మగ్గిపోవాల్సి వస్తోంది. ప్రస్తుతమున్న అద్దెభవనంలోని చాలీచాలని గదుల్లో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్ల దుస్థితి దయనీయంగా ఉందని అక్కడ పరిశీలించిన అధికారులే చెబుతున్నారు.

బిల్లులు రాగానే పనులు చేయిస్తాం

ప్రభుత్వం నుంచి పెండింగ్ బిల్లులు రాగానే మిగిలిన పనులు వేగంగా పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామని ఆర్అండ్‌బీ డీఈ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. రూ.12కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించిన నాలుగైదు నెలల్లోనే పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రస్తుతం విద్యార్థులు అద్దెభవనాల్లో ఉన్నారనే విషయాన్ని కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

రీ సర్వేతో.. భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

● వందేళ్ల తర్వాత డిజిటల్ నమోదు ● భూ రికార్డుల సమగ్ర ప్రక్షాళన కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

భూరికార్డులు సమగ్రంగా లేకపోవడం వివాదాలకు, ఘర్షణలకు కారణమవుతోంది. తప్పుడు రికార్డుల ఆధారంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు గుర్తించిన కేంద్ర ప్రభుత్వం భూమి రికార్డులను ప్రక్షాళన చేసేందుకు రీ సర్వేకు ఆదేశించింది. వందేళ్ల తర్వాత చేస్తున్న ఈ సర్వేతో భూవివాదాలు పరిష్కారం అవుతాయని ఆశిస్తోంది.



సమగ్ర భూ సర్వేను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ (ఫైల్‌ఫొటో)

సంబేపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): 1923-24 లో దేశంలో భూరికార్డులను ఆధునికీకరించా రు. భూములు కొలిచి ఫీల్డ్ మెజర్మెంట్ బుక్ (ఎఫ్‌ఎంబీ)లో నమోదు చేశారు. అప్పట్లో నాటిన సర్వే రాళ్ల కేంద్రంగానే నేటికీ భూము లను కొలుస్తూ ఉంటారు. యజమానులు మా రినా ఆయా భూముల పంపకాల ఆధారంగా భాగాలను చేసి సర్వే నెంబర్లు మాత్రం అవే కొనసాగిస్తున్నారు. వందేళ్ల నాటి ఎఫ్‌ఎంబీ ఆధారంగా ప్రస్తుతం భూముల సర్వే చాలా ఆలస్యం అవుతోంది. భూరికార్డులు సరిగా లేకపోవడం వివాదాలకు కారణమవుతోందని కేంద్ర ప్రభుత్వం గుర్తించి రీసర్వేకు ఆదేశించి నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా ప్రతి కమతాన్ని అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా మార్కింగ్ చేసి, నెంబర్ కేటాయించడంతో పాటు క్యూఆర్ కోడ్ నమో దు చేస్తుండడంతో భూవివాదాలు పరిష్కారం అవుతాయని చెబుతున్నారు. వైసీపీ హయాం లో 2022-23 సంవత్సరంలో రాష్ట్రంలో 4,500 సర్వే బృందాలతో రూ.1000 కోట్లు ఖర్చు చేసి, 3.31 కోట్ల ఎకరాలు రీ సర్వే చేసినట్లు సమాచారం. దీనికోసం డ్రోన్స్, ఓఆర్‌పీ పరికరాలు, రోవర్లు, హెలికాప్టర్లు వినియోగించారు. సర్వే బృందానికి తగిన గడువు ఇవ్వకపోవడంతో పలు తప్పిదాలు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం రెవెన్యూ గ్రామసభల్లో గ్రామాల్లో వచ్చిన అర్జీలే ఇందుకు నిదర్శనం.

గ్రామసభల్లో సగం అర్జీలు అవే

ఇటీవల జరిగిన రెవెన్యూ గ్రామ సదస్సుల్లో 1013 అర్జీలు రాగా అందులో 600కు పైగా భూసర్వే కారణంగా ఏర్పడిన సమస్యలే ఉన్నాయి. ఒకే సర్వే నెంబరులో నలుగురు రైతులు ఉన్నా ఒక ఎల్పీఎం నెంబర్ మాత్రమే ఇవ్వడం, రీసర్వే తర్వాత భూవిస్తీర్ణంలో వ్యత్యాసాలు రావడం, ఫొటోలు మారిపోవడం వంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రీసర్వే ప్రారంభమైంది.

అధికారుల పర్యవేక్షణ

గత ప్రభుత్వంలో సర్వేలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చూసేందుకు అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

ఇటీవల సంబేపల్లె, కలకడ మండలాల్లో రీసర్వే పనులను జాయింట్ కలెక్టర్ పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. సుండుపల్లె మండలంలో రాజంపేట సబ్‌కలెక్టర్ నిదియాదేవి పరిశీలించారు. సర్వే సిబ్బందికి అవసరమైనంత సమయం ఇవ్వడంతో భూసమస్యల శాశ్వత పరిష్కారానికి మార్గం సుగమమైంది.

భూ వివాదాలు పరిష్కారం..

భూ సమగ్ర సర్వేతో దశాబ్దాలుగా ఉన్న భూవివాదాలు పరిష్కారం అవుతాయి. గతంలో తక్కువ సమయం కారణంగా ఒత్తిడి పెరిగి తప్పిదాలు జరిగిన మాట వాస్తవమే. ప్రస్తుతం తగినంత సమయం ఇవ్వడంతో ప్రతి ఎకరం సర్వే చేసి, వివాదాలకు పరిష్కార మార్గం చూపేందుకు ఆస్కారం ఉంది.

-హరికృష్ణ, మండల సర్వేయర్, సంబేపల్లె

ఒకే ఎల్‌పీఎం నెంబర్ ఇవ్వడమే సమస్య

ఒక సర్వే నెంబర్‌లో నలుగురు రైతులం ఉన్నాం. రీసర్వేలో ఒకే ఎల్‌పీఎం నలుగురికి ఇవ్వడం సమస్యగా మారింది. ప్రస్తుతం వన్‌బీ రావడం లేదు. రీసర్వేతో గ్రామాల్లో మ్యుటేషన్ నిలిపివేయడం రైతులకు సమస్యగా మారింది. గ్రామ సభల్లో అర్జీలు ఇచ్చాం. త్వరగా సమస్య పరిష్కరించాలి.

- వెంకటేశ్వర్లు, రైతు, నారాయణరెడ్డిగారిపల్లె,



రీసర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్ (ఫైల్‌ఫొటో)

రాష్ట్రానికి రాహు, కేతువులు వైసీపీ, టీడీపీ కూటమి

● రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి



తులసిరెడ్డిని సన్మానిస్తున్న రాయచోటి కాంగ్రెస్ పార్టీ నేతలు

రాయచోటిటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ కూటమి దొందూ దొందేనని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసిరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆయన రాయచోటిలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ, టీడీపీ కూటమి రాష్ట్రానికి రాహు కేతువులుగా దాపురించాయని, జగన్ అరచేతిలో వైకుంఠం చూపిస్తే చంద్రబాబు కైలాసం చూపిస్తున్నాడని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు తయారైందన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల, అరాచక, ఆటవిక, మద్య, జూద, డ్రగ్స్, గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వంలో మండలానికి 4 మద్యం షాపులు, 40 బెల్టుషాపులు అన్నట్లు అయ్యిందన్నారు. పాఠశాలల్లో డ్రగ్స్, గంజాయి సంస్కృతి ప్రవేశించిందన్నారు. కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకింది అన్నట్లు గత ప్రభుత్వం కంటే ప్రస్తుత ప్రభుత్వం ఎక్కువగా అప్పులు చేస్తోందన్నారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై రూ.15,485 కోట్ల అదనపు భారం మోపిందన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కాంగ్రెస్ పార్టీతోనే స్వర్ణాంధ్ర సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి అల్లాబకష్, మదనపల్లి సీనియర్ కాంగ్రెస్ నేత రెడ్డిసాహెబ్, రేణిగుంట సీనియర్ సీనియర్ నేత చిరంజీవి, రాయచోటి సీనియర్ కాంగ్రెస్ నేత ఎస్‌యండీ గౌస్, మైనార్టీ సెల్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సయ్యద్ అలీ, రాయచోటి పట్టణ అధ్యక్షులు దాదా సర్దార్, వీరబల్లి మండలశాఖ అధ్యక్షులు జనార్ధన్, చెన్నకృష్ణ, ఖదీర్, రెడ్డెయ్యరాజు, ఇర్ఫాన్, మహమ్మద్ అలీ, సాధిక్, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కోర్టులోగంగమ్మకు క్షీరాభిషేకం

మదనపల్లె అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెంగళూరు రోడ్డు కోర్టులో ఆవరణలో ఉన్న గంగమ్మ ఆలయంలో ఈ నెల 19వ తేదీన 108 లీటర్ల పాలతో క్షీరాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం క్షీరాభిషేకం, సాయంత్రం కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, అలంకరణలు ఉంటాయని తెలిపారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

భర్త నుంచి రక్షణ కల్పించండి

● ఎస్పీకి మదనపల్లె మహిళ మొర



ఎస్పీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న బాధితులు

రాయచోటి టౌన్, మార్చి17(ఆంధ్రజ్యోతి): పరాయి స్త్రీ మోజులోపడి కట్టుకున్న భర్త కాలయముడుగా మారాడని మదనపల్లె పట్టణానికి చెందిన భాస్కర్ భార్య పార్వతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు మొరపెట్టుకున్నారు. అనంతరం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం బయట ఆమె మీడియాకు వివరాలు వెల్లడించారు. తనకు భాస్కర్‌తో పెళ్లి అయి 25 ఏళ్లైందని, వివాహ సమయంలో తమ తల్లిదండ్రులు రూ.5 లక్షలు నగదుతో పాటు 350 గ్రాముల బంగారు నగలు, 150 గ్రాములు వెండి వస్తువులు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం తన భర్త భాస్కర్ పరాయి స్త్రీ మోజులో పడి అదనపు కట్నం తీసుకురావాలని ప్రతిరోజు తనను కొడుతూ, తిడుతూ మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఫిర్యాదులో వివరించారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను అంత డబ్బు అడగలేక, భర్త పెట్టే బాధలు భరించలేక మానసిక క్షోభ అనుభవిస్తున్నానని వాపోయారు. తన అత్తమామలు, భర్త భాస్కర్, అతని ప్రియురాలు అర్చనతో పాటు, మరిది గోపి అతని భార్య, తనను చం పడానికి ప్రయత్నాలు చేయడంతో తాను తప్పించుకొని పుట్టింటికి చేరానని, అక్కడికి కూడా తన కిరాయి మనుషులను పంపించి చంపడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు, తన పిల్లలకు రక్షణ కల్పించి న్యాయం చేయాలంటూ ఆమె ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప, తనతల్లిదండ్రులు రామప్ప, లక్ష్మమ్మ తదితరులతో కలిసి ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి



రాజశేఖర్ మృతదేహం

లక్కిరెడ్డిపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తా పడి ఓ యువకుడు మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు మండలంలోని బి. ఎర్రగుడి పంచాయతీ చంచర్లపల్లెకు చెందిన వండాడి రాజశేఖర్ (28) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. సోమవారం ఉదయం మామిడి చెట్లకు ట్యాంకర్ ద్వారా నీరందించేందుకు వెళుతుండగా, దారిలోని మలుపులో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. రెండేళ్ల క్రితం అతని భార్య మృతి చెందడంతో రెండో వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం ఆమె నిండు గర్భిణి అని వారు వివరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

ముగ్గురి బైండోవర్



బైండోవర్ చేసిన వ్యక్తులతో ఎస్ఐ వరుణ్‌కుమార్

ఓబులవారిపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వై.కోటకు చెందిన ముగ్గురు వ్యక్తులను బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ వరుణ్‌కుమార్ తెలిపారు. వై.కోట గ్రామానికి చెందిన వెంకట సుబ్బయ్య, చలపతి, పెంచలయ్య గతంలో నాటుసారా తయారీ కేసుల్లో నిందితులుగా ఉన్నారని, వీరిని ఓబులవారిపల్లె తహసీల్దారు శ్రీధర్‌రావు ఎదుట హాజరుపరిచి బైండోవర్‌కు సంబంధించి నిబంధనలు తెలియజేసి విడిచిపెట్టినట్లు రైల్వేకోడూరు ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ వరుణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక యువతి అనుమానాస్పద మృతి

● రాత్రికిరాత్రే మృతదేహం తరలింపు

● ఆలస్యంగా వెలుగులోకి.. ● హత్యా... ఆత్మహత్యా?

గుర్రంకొండ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడుకు చెందిన ఓ మిల్‌లో కర్ణాటక రాష్ట్రం బెల్గాంకు చెందిన కుమార్, సంగీత(21) దంపతులు ఏడాదిన్నరగా కూలి పనులు చేస్తున్నారు. ఈ మధ్య వారు తరచూ గొడవపడుతున్నట్లు సమాచారం. గత నెలలో శివరాత్రి నాడు భర్త ఇట్లో లేని సమయంలో సంగీత ఉరి వేసుకొని మృతి చెందింది. విషయాన్ని కుమార్ తన తోటి కూలీలు, యజమానికి చెప్పడంతో రాత్రికిరాత్రే ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో మృతదేహాన్ని బెల్గాంకు తరలించారు. ఈ విషయం ఆలస్యంగా బయటకు రావడం పలు అనుమానాలు రేకెత్తించింది. కాగా యువతి మృతికి గల కారణాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అలాగే అనుమానం ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం. కాగా, సంగీతది ఆత్మహత్యా, హత్యా అన్న విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

ప్రభుత్వం మారినా..పుంగనూరు రాజ్యాంగం మారలేదు

● అరాచక శక్తుల మెడలు వంచుతాం ● చమర్తి జగన్‌మోహన్‌రాజు



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

మదనపల్లె టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా..పుంగనూరులో పెద్ది రెడ్డి రాజ్యాంగం మారలేదని, అలాంటి అరాచక శక్తుల మెడలు వంచుతామని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం లోని పుంగనూరు నియోజకవర్గం కృష్ణాపురంలో సోమవారం టీడీపీ కార్యకర్త కాగితి రామకృష్ణ కుటుంబీకులను పలువురు టీడీపీ నాయ కులు పరామర్శించారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రాజు మాట్లాడు తూ పార్టీ అధిష్ఠానం ఆదేశాలతో చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఖాదీ కార్పొరేషన్ చైర్మన్ కేకే చౌదరి, పుంగనూరు అబ్జర్వర్ భాస్కర్ యాదవ్‌లతో కలపి రామకృష్ణ కుటుంబీకులకు ధైర్యం చెప్పామన్నారు. హత్యా రాజకీయాలు ప్రోత్సహిస్తున్న వారిని ప్రభుత్వం ఉపేక్షించదన్నారు. అలాంటి వారికి చట్ట ప్రకారం శిక్ష పడటం ఖాయమన్నారు. వైసీపీ నాయకుల బరితెగింపు చర్యలు అంతమయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. గ్రామాల్లో శాంతియుత వాతావర ణం ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. గూండాలు, అరాచక శక్తులను ప్రభుత్వం అణచి వేస్తుందన్నారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం లక్ష రూపాయలను నగదును రామకృష్ణ కుమారులు శివ, శ్రీనివాసులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి వై.దొరస్వామినాయుడు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు మోడెం సిద్దప్ప, నీలకంఠ, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పురి రమేశ్, నాదెళ్ల అరుణ్‌తేజ, తదితరులు పాల్గొన్నారు.

ముదివేడు తిరునాళ్లకు 27 ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివేడులో ఈ నెల 19న ప్రారంభమయ్యే జాతర సందర్భంగా మదనపల్లె వన్ డిపో నుంచి ముదివేడుకు 27 బస్సులను నడుపుతున్నట్లు వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రైవేటు వాహనాల్లో వెళ్లి ఇబ్బందులు పడకుండా, అధిక చార్జీలతో ఆర్థికంగా నష్టపోకుండా స్పెషల్ సర్వీసులు నడుపుతున్నామని తెలిపారు. సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ సర్వీసు లను సద్వినియోగం చేసుకోవాలని డీఎం విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ సిబ్బంది అందు బాటులో ఉంటూ అసౌకర్యం కలగకుం డా బాధ్యతగా వ్యవహరిస్తారని వివరించారు.

రాయచోటి సబ్‌జైలు పరిశీలన



రాయచోటి సబ్‌జైల్లో రికార్డులను పరిశీలిస్తున్న కడప కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బాబాఫకృద్దీన్

రాయచోటి టౌన్, మార్చి17(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి సూచనల మేరకు సెక్రటరీ- కం- సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫకృద్దీన్ సోమవారం రాయచోటి సబ్‌జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జైలు పరిసరాలను, రిజిస్టర్‌లను పరిశీలించి తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. లీగర్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై అవగాహన కల్పించారు ఏవైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయ సేవా సమితిని, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి సబ్‌జైలు సూపరింటెంట్, ప్యానల్ న్యాయవాది, ఖైదీలు పాల్గొన్నారు.

ముద్దు గుమ్మలు కాదు.. దిష్టి బొమ్మలు..!





రైల్వేకోడూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పొలాలకు దృష్టిదోషం తగులకుండా నల్లకుండలకు దిష్టి చుక్కలు పెట్టేవారు. తర్వాత గడ్డితో తయారు చేసిన బొమ్మలను ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం సినీ తారల అర్ధనగ్న చిత్రాలను పొలాల మధ్యలో పెడుతున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో మామిడి, బొప్పాయి, అరటి, దోస, కర్బూజా తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఎక్కువగా దిగుబడులు వచ్చినపుడు దృష్టిదోషం తగులకుండా దిష్టిబొమ్మలను ఏర్పాటు చేసేవారు. కాలాను గుణంగా రైతులూ మారిపోయారు. బికినీలతో ఉన్న సినీతారల చిత్రాలను దిష్టి బొమ్మ లుగా ఏర్పాటు చేస్తున్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలో రోడ్డు పొడవునా ఉన్న పొలాల్లో ఇలాంటి దృశ్యాలు ఆ మార్గంలో వెళుతున్న వారిని ఆకట్టుకుంటున్నాయి.

50 వసంతాల బడి..!



ములకలచెరువులోని జడ్పీ ఉన్నత పాఠశాల

- ములకలచెరువు జడ్పీ ఉన్నత పాఠశాల ఏర్పాటై 50 ఏళ్లు పూర్తి
- ఇక్కడ చదువుకున్న విద్యార్థుల్లో ఎందరో ప్రముఖులు
- స్వర్ణోత్సవాలకు సన్నాహాలు చేస్తున్న పూర్వ విద్యార్థులు

ములకలచెరువు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎంతో మందికి విద్యాబుద్దులు నేర్పిన పాఠశాల. ఇక్కడ చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారు ఎందరో ఉన్నారు. ఎందరికో అక్షరాలు నేర్పిన ములకలచెరువు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 50 వసంతాలు పూర్తి చేసుకుంది. ఇక్కడ చదువుకున్న పూర్వ విద్యార్థులు ముందుకొచ్చి గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరిపితే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ములకలచెరువులోని పీటీఎం రోడ్డులో 1974-75 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఏర్పాటైంది. పాఠశాల ప్రాంగణం ఎంతో విశాలంగా ఉంటుంది. ఆటస్థలం, పచ్చని చెట్ల మధ్య పాఠశాల ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. 50 ఏళ్ళుగా 10వేల మంది ఇక్కడ చదువుకున్నారు. ఈ పాఠశాలలో చదివిన శ్రీనివాసులునాయక్ ప్రస్తుతం శ్రీ కాళహస్తిలో జిల్లా కోర్టు జడ్జిగా ఉన్నారు. అలాగే శివశంకర్‌రెడ్డి బెంగళూరులో డీఎస్పీగా పని చేస్తున్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఇక్కడే చదివారు. అలాగే ఇక్కడ చదువుకున్న గోట రామచంద్ర, అమరనాథరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నౌషాద్, సుధాకర్‌రెడ్డి, ఆనందరెడ్డి,ఖాదర్‌బాషా, మహమ్మద్‌రఫీ తదితరులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్నారు. ఇలా ఎంతో మంది ఇక్కడే చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు.

ఇక్కడే చదివి... ఇక్కడే విధులు

ములకలచెరువుకు చెందిన పూల కృష్ణారెడ్డి ప్రస్తుతం పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయ న 1976 నుంచి 1981 వరకు ఇక్కడే చదువున్నారు. ఆయన చ దువుకునే సయమంలో స్కూల్ ఫస్ట్‌గా నిలిచాడు. ప్రస్తుతం తాను చదువున్న పాఠశాలలోనే ఆయన హెడ్మాస్టర్‌గా పనిచేస్తున్నారు.

త్వరలో పూర్వ విద్యార్థులతో సమావేశం

పదవ తరగతి పరీక్షల అనంతరం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించేందుకు హెడ్మాస్టర్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించేందుకు పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో వేడుకల నిర్వహణపై చర్చించునున్నారు.

పాఠశాల ఏర్పాటై 50 వసంతాలు పూర్తి..



ములకలచెరువు జడ్పీ హైస్కూల్ 1974-75 లో ఏర్పడింది. గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం. పూర్వ విద్యార్థులు ముందుకొస్తే బాగుంటుంది. నేను ఇదే పాఠశాలలో చదువుకున్నాను. ఇక్కడే చదువుకుని హెడ్మాస్టర్‌గా పనిచేస్తున్న సమయంలో పాఠశాలకు 50 ఏళ్ల పూర్తి కావడం ఎంతో సంతోషం కలిగిస్తోంది.

- కృష్ణారెడ్డి, హెడ్మాస్టర్, జడ్పీ హైస్కూల్

ఎంతో సంతోషంగా ఉంది



ములకలచెరువు జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి వరకు చదువుకుని పారిశ్రామిక వేతగా ఎదిగాను. పాఠశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించేందుకు సహాయ, సహకారాలు అందిస్తాను. పాఠశాల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తాను. ప్రభుత్వ సహకారంలో పాఠశాలలో అన్ని వసతుల కల్పనకు కృషి చేస్తాను.

- దాసరిపల్లి జయచంద్రారెడ్డి, పూర్వ విద్యార్థి

ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : ఎస్పీ

కడప క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించాలని.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడారు. సంబంధిత అధికారులకు ఫోను ద్వారా వారి సమస్యలను తెలిపి పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు సమస్యను ప్రశాంతంగా వివరించడానికి సిబ్బంది సహాయం చేశారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, మహిళా పీఎస్ డీఎస్పీ రమాకాంత్ పాల్గొన్నారు.

అత్యాధునిక పిచ్ రోలర్ ప్రారంభం



పిచ్ రోలర్‌ను డ్రైవ్ చేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప నగరంలోని పోలీసు క్రికెట్ స్టేడియంలో అత్యాధునిక పిచ్ రోలర్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న పిచ్‌ను క్రికెట్ టోర్నమెంట్లకు అనుకూలంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా రోలర్‌ను తెప్పించారు. రోలర్‌కు జిల్లా ఎస్పీ పూజ నిర్వహించి స్వయంగా డ్రైవ్ చేసి పరిశీలించారు. నిరంతరం విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది క్రీడల ద్వారా నూతనోత్తేజం పొందవచ్చని, స్టేడియంను సద్వినియోగం చేసకోవాలని సూచించారు. అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ ఇతరులు కూడా స్టేడియాన్ని అద్దె ప్రాతిపదికన ఉపయోగించుకోవచ్చని, వివరాలకు 9121100641 లేదా 9000144343 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వేలం ద్వారా 'గండి'కి రూ.1.75 లక్షల ఆదాయం

చక్రాయపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో వేలంపాటలు నిర్వహించారు. కౌలుదారులకు, షాపింగ్ కాంప్లెక్స్, సులబ్‌కాంప్లెక్స్, పాలు, పెరుగు సరఫరా, నిత్యన్నదాన పథకానికి కావాల్సిన కూరగాయలకు వేలం పాట నిర్వహించారు. ఇడుపులపాయలో 469 సర్వేనెంబర్‌లో 8.72 ఎకరాల భూమి మూడు సంవత్సరాలు కౌలు చేసుకోవచ్చు, అందులో ఏడాదికి ఇడుపులపాయకు చెందిన మహేష్ రూ.1.51 లక్షలు అత్యధికంగా పాడిపాట దక్కించుకున్నారు. మూడేళ్ల క్రితం ఈ భూమి కౌలు ఏడాదికి రూ.30వేలు పాడారు. వీరన్నగట్టుపల్లె సమీపంలో 0.98 ఎకరాల భూమిని ఆర్.తేజేశ్వర్ రూ.4వేలకు వేలం పాడి దక్కించుకున్నారు. సులబ్ కాంప్లెక్స్‌కు ఇడుపులపాయకు చెందిన వెంకటరత్నం ఏడాదికి రూ.20 వేలకు దక్కించుకున్నారు. కూరగాయలకు, పాలు, పెరుగుకు టెండర్‌లో సరైన ధర లేకపోవడంతో నిలుపుదల చేశారు. కార్యక్రమంలో ఛైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ ఛైర్మన్ కల్లూరు వెంకటస్వా మి, దేవస్థాన ఉప ప్రధాన అర్చకుడు రాజారమేష్, కడప దేవాదాయశాఖ తనిఖీదారు శివయ్య, ఆర్కేవ్యాలీ పోలీసులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

బీఈడీ, ఎంఈడీ పరీక్షలు ప్రారంభం



హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కృష్ణారావు

కడప ఎడ్యుకేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని కేంద్రాల్లో బీఈడీ, ఎంఈడీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. బీఈడీ పరీక్షలకు 4463 మంది విద్యార్థులు, ఎంఈడీ పరీక్షలకు 63 మంది విద్యార్థులు హాజరయ్యారు. కడపలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల, విజయలక్ష్మి బీఈడీ కళాశాల పరీక్ష కేంద్రాలను విశ్వవిద్యాలయ కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు, అబ్జర్వర్లు ఆచార్య మాధవి, ఆచార్య రియాజ్ ఉన్నీసా అకస్మికంగా తనిఖీ చేశారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించేలా చూడాలని చీఫ్ సూపరింటెండెంట్‌లకు సూచనలిచ్చారు.


ప్రారంభమైన లా పరీక్షలు

యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని మూడు, ఐదేళ్ల లా కళాశాలల విద్యార్థుల సెమిస్టర్ పరీక్షలు సోమవారం యోగవేమన విశ్వవిద్యాలయంలో ప్రారంభమయ్యాయి. మూడేళ్ల ఎల్ఎల్‌బీ 3,5 సెమిస్టర్లు, ఐదేళ్లకు సంబంధించి 3,5,7,9 సెమిస్టర్లు చదువుతున్న విదార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 75 మంది విద్యార్థులు హాజరు కాగా మధ్యాహ్నం 173 మంది రాశారు. రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షల ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెండెంట్లు డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ మునికుమారి పర్యవేక్షించారు.

పదోన్నతుల్లో మాకు అన్యాయం

- ఇన్‌చార్జి కలెక్టర్‌కు ఏఎన్ఎంల ఫిర్యాదు

చిత్తూరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గ్రేడ్-3 ఏఎన్ఎంల పదోన్నతుల్లో తమకు అన్యాయం జరిగిందని మదనపల్లెలో పనిచేస్తున్న కొందరు ఏఎన్ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఇన్‌చార్జ్ కలెక్టర్ విద్యాధరి, డీఎంహెచ్‌వో సుధారాణిని కలిసి ఫిర్యాదు చేశారు. తామంతా మదనపల్లె మున్సిపాలిటీలో వార్డు సచివాలయాల్లో హెల్త్ సెక్రటరీలుగా పనిచేస్తున్నామని చెప్పారు. గతనెల 21వ తేదీన ప్రమోషన్ లిస్ట్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిందన్నారు. అందులో తాము ప్రమోషన్ లిస్ట్‌లో ఉన్నామన్నారు. తర్వాత విడుదలైన ప్రమోషన్ ప్రపోజల్ కేటగిరీ లిస్టులో తమ పేర్లు లేవని తెలిపారు. అందులో తమకన్నా కింద ఉన్నవారి పేర్లు ఉన్నాయని చెప్పారు. విచారించి, న్యాయం చేయాలని కోరారు.



మత్తు కోసం...

- గాడి తప్పుతున్న మైనర్లు, యువత
- మాత్రలు, సొల్యూషన్, గంజాయి వినియోగం
- ఇన్‌స్టాగ్రామ్ ద్వారానే విక్రయాలు
- రూ.20 విలువ చేసే మాత్ర రూ.500కు
- కొరవడుతున్న తల్లిదండ్రుల నిఘా

యువత మత్తు వలయంలో చిక్కుకుని విలవిల్లాడుతోంది. తెలిసీ తెలియని వయసులో ఫ్యాషన్ పేరుతో సరదాగా సిగరెట్లు, మద్యం తో మొదలైన అలవాటు క్రమంగా గంజాయి, సొల్యూషన్, వైట్‌నర్ వంటి వాటిని పీలుస్తూ మత్తులో ఊగిపోతున్నారు. ఎక్కువగా 12 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్కులే ఇలాంటి మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుతుండడం గమనార్హం. దీనిపై ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి ప్రస్తావించడం గమనార్హం.

కడప (క్రైం), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చాలా మంది యువత మత్తు కోసం మద్యం, గంజాయితో పాటు ప్రమాదకరమైన మత్త పదార్థాలను వినియోగిస్తూ అనారోగ్యం పాలవుతున్నారు. కడప నగరంలోని పలు ప్రాంతాల్లో యువకులు వీటికి అలవాటు పడుతున్నారు. చిన్నచౌకు, తిలక్‌నగర్, మాచుపల్లి రోడ్డులోని ఉక్కాయపల్లి డంప్‌యార్డు, బాలాజీనగర్, అల్మాస్ పేట, సాయిపేట, నకాష్, రవీంద్రనగర్, ఖలీల్ నగర్‌తో పాటు బుగ్గవంక కాలువ సైడ్‌వాల్ వంటి ప్రాంతాల్లో యువకులు మద్యం, గంజాయి లాంటి అలవాట్లే కాకుండా ఇప్పుడు ఎక్కువగా మత్తు ఎక్కించే ట్యాబ్లెట్లను వినియోగిస్తుండడం గమనార్హం. వీటిని కొన్ని మెడికల్ స్టోర్లలోనే కాకుండా సెల్‌పాయింట్లలో రూ.20విలువ చేసే మాత్రలు రూ.500లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఇన్‌స్టాగ్రామ్ ద్వారా విక్రయాలు

గంజాయికి అలవాడుపడిన యువకులు చిన్న చిన్న బ్యాచ్‌లను ఏర్పాటు చేసుకొని గంజాయిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఒకప్పుడు గంజాయి చిన్న ప్యాకెట్ రూ.50 నుంచి వంద రూపాయాలు విక్రయించే వారు. ఇప్పుడు రూ.వెయ్యికి పైనే విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గంజాయి విక్రయించే వారు సోషల్ మీడియాను వేదికగా చేసుకొని.. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా యథేచ్ఛగా విక్రయాలను సాగిస్తున్నారు. గంజాయి, ట్యాబ్లెట్స్ అవసరం ఉన్న వారికి ఇన్‌స్ట్రాగ్రామ్ ఐడీని ఇస్తారు. ఎవరికీ అనుమానం రాకుండా ఎవరూ లేని చోటికి పిలిపించుకొని వారికి విక్రయిస్తారు. ఫోన్‌పే లేకుండా క్యాష్ ఉంటేనే ఇస్తా రు. దీంతో పోలీసులు వీరిని గుర్తించడం కష్టతరంగా మారుతోంది.



డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టి యువకులకు కోటింగ్ ఇస్తున్న పోలీసులు

డ్రోన్ కెమెరాలతో పోలీసు నిఘా

గంజాయి, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. కడప నగరం శివారులో గంజాయి సేవనం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది అత్యాధునిక డ్రోన్ కెమెరాల సాయంతో నిఘా ఉంచేలా చర్యలు చేపట్టారు. ఆయా ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. అనుమానాస్పదంగా సంచరించే వారిపై నిఘా ఉంచడంతో పాటు గంజాయిని సేవించే వారిని గుర్తించేందుకు విస్తృత చర్యలు చేపట్టారు.

డాక్టరు ప్రిస్కిప్షన్లు లేకుండానే..

ప్రమాదకరమైన మత్తు ట్యాబ్లెట్లు, ఇంజక్షన్లు యువకులు తీసుకుంటున్నారు. వైద్యుల అనుమతి లేకుండానే ట్యాప్ ఫ్రీ ఈఆర్ 50, రెస్టల్ 0.5/0.25 ఎంజీ, క్లోనోట్రిల్ 0.5 లాంటి మాత్రలు వినియోగిస్తున్నారు. వీరిలో ఎక్కువగా మైనర్‌లే ఉన్నారు. ఇలాంటి వారు ఎక్కువ రోజులు జీవించలేక మధ్యలో ఆయూస్సు తీసుకుంటున్నారు. అటు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఇటు అధికారులు యువతపై నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాగా, ఇటీవల ఒన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో నిఘా ఉంచి కొందరి యువకులను అదుపులోకి తీసుకొని విచారించగా.. కర్నూలు జిల్లా నుంచి మత్తు ట్యాబ్‌లెట్స్ వస్తున్నట్లు గుర్తించారు. అలాగే మందుల షాపుల నిర్వహకులకు ఒన్‌టౌన్ సీఐ రామకృష్ణ కెమిస్ట్ అండ్ డ్రగ్స్ అధికారులతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. అనుమతులు లేకుండా మత్తు మాత్రలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొరవడుతున్న తల్లిదండ్రులు నిఘా...

తమబిడ్డల పట్ల తల్లిదండ్రులు నిఘా లేకపోవడంతో యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని సర్వనాశనం చేసుకుంటున్నారు. పిల్లలు రాత్రిళ్ల ఎక్కడెక్కడ తిరుగుతున్నారు. ఎవరితో తిరుగుతున్నారో సరిగా పట్టించుకోకపోవడంతోనే పిల్లలు మాదకద్రవ్యాలకు అలవాటు పడి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ఈ మత్తుకు బానిసలుగా మారిన యువకులు ఏం చేస్తున్నారో వారికే అర్థం కాకు గొడవలకు పాల్పడుతన్నారు. మరికొందరు నిషా మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులను చూపుతున్న సీఐ రాజగోపాల్

బద్వేలుటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి ఒకటిన్నర్ర కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాజగోపాల్ తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఉత్తర్వుల మేరకు మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఐలు సత్యనారాయణ, రవికుమార్‌లు సిబ్బందితో కలసి మున్సి పాలిటీ పరిధిలోని చెన్నంపల్లె ఎస్టీకాలనీ కాశినాయన గుడిదగ్గర అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న రాజుగారివీధికి చెందిన పందు మనోజ్‌కుమార్, వల్లెలవారిపల్లెకు చెందిన రాజ్‌కుమార్‌లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఒకటిన్నర్ర కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. నిషేదిత గంజాయి అక్రమరవాణా చేసినా, అమ్మకాలు చేపట్టినా, వారికి సహకరించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బుగ్గవంక కాల్వలో వ్యక్తి మృతి

కడప క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తారకరామానగర్ సమీ పంలోని బుగ్గవంక కాల్వలో పఠాన్ మాదర్‌ఖాన్ (60) అనే వ్యక్తి మృతి చెంది నట్లు తాలుకా ఎస్ఐ తాహిర్ హుసేన్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. రాజుకాలనీకి చెందిన మాదర్‌ఖాన్ బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి... కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముగ్గురు విద్యుత్ శాఖ ఇంజినీర్లపై విచారణ

- మరో లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మ్యాన్‌లపై కూడా..
- ప్రైజెంటింగ్ అధికారిగా కడప ఏసీబీ సీఐ నాగరాజు నియామకం

కలికిరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడి పక్కా ఆధారాలతో ఏసీబీకి చిక్కిన మైదుకూరు విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఎక్జిక్యూటివ్ ఇంజినీరు కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు ఇంజినీర్లు, ఒక లైన్ ఇన్‌స్పెక్టర్, మరో లైన్‌మ్యాన్‌లపై ఏపీ ఎస్పీడీసీఎల్ విచారణకు నిర్ణయించింది. మైదుకూరు విద్యుత్‌శాఖ ఏఈఈ కార్యాలయంలో 2022 మార్చి 30న ఏసీబీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. పలువురు ఇంజినీర్లు, ఉద్యోగుల అవినీతికి సంబంధించి ఫిర్యాదులు అందడంతో ఏసీబీ తనిఖీలు చేపట్టింది. ఫలితంగా మైదుకూరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎ.రామభద్రయ్య, మరో ఏఈఈ చౌడమ్ హరికృష్ణ, జూనియర్ ఇంజినీరు జి.రాజకుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ సింగారపు జయరాజు, లైన్‌మ్యాన్ ఎస్.నాగరాజ రెడ్డిలు అవినీతికి పాల్పడినట్లు ఏసీబీ తనిఖీల్లో వెల్లడయ్యింది. దీనిపై పలు అభియోగాలతో కేసు నమోదు చేసి తరువాత చర్యల కోసం ప్రభుత్వానికి నివేదించింది. ఏసీబీ నమోదు చేసిన అభియోగాలకు సంబంధించి పూర్వాపరాలను పరిశీలించిన ప్రభుత్వం శాఖపరంగా తగిన విచారణ చేపట్టాలని ఎస్పీడీసీఎల్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో విచారణకు తగిన ఆధారాలను, వివరాలను ఏసీబీ తరపున విచారణ అధికారి ముందుంచేందుకు ప్రెజెంటింగ్ అధికారిగా కడప ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎన్.వి.నాగరాజును నియమించాలని ఏసీబీ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలను ఆమోదిస్తూ విచారణాధికారులకు సహకరించేందుకు ఏసీబీ ఇన్‌స్పెక్టర్ నాగరాజును నియమిస్తూ రాష్ట్ర ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

నాలుగేళ్లయినా పూర్తి కాని భవన నిర్మాణాలు

- పొలాల మధ్య భయాందోళనలో ఉంటున్న విద్యార్థినులు
- మండలిలో ప్రస్తావించిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

పులివెందులటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండల కేంద్రంలో బాలికల బీసీ వసతిగృహం నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థినులకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని మండలిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కోరారు. సోమవారం మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల కిందట బాలికల బీసీ వసతిగృహం మంజూరైనా.. ఇప్పటికీ నిర్మాణ పనులు పూర్తి కాలేదన్నారు. నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టరు కూడా పనులు ఆపివేసి వెళ్లిపోయారన్నారు. నిర్మాణ పనులు పూర్తయ్యేంత వరకు తాత్కాలికంగా పులివెందుల పట్టణ శివార్లలో పొలం వద్ద భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారని.. అక్కడ సరైన రక్షణ లేక పాములు వస్తుండడంతో విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారన్నారు. ఈ మధ్యకాలంలో మంత్రి సందర్శించారని.. అక్కడ బాలికలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్నారన్నారు. త్వరితగతిన పూర్తి చేసి వచ్చే అకడమిక్ ఇయర్ కన్నా విద్యార్థినులకు నూతన భవనాలు అందుబాటులోకి వచ్చేలా చేయాలని కోరారు. ఇందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సానుకూలంగా స్పందించారు.

జ్యోతిక్షేత్రంలో కూల్చివేసిన నిర్మాణాలను వెంటనే పునర్‌నిర్మించాలి



నిరసన కార్యక్రమంలో కాశినాయన భక్తిపాటలు ఆలపిస్తున్న భక్తులు

కడప మారుతీనగర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): టైగర్ జోన్‌కు దగ్గరగా ఉందనే నెపంతో లక్షలాది మంది మనోభావాలు దెబ్బతినేలా ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కాశిరెడ్డినాయన జ్యోతి క్షేత్రంలో గత కొన్ని సంవత్సరాలుగా గల ఆశ్రమ వసతి గృహాలను అటవీశాఖ అధికాలు కూల్చివేయడం బాధాకరమని హిందూస్ ఫర్ ప్లూరలిటీ ఈక్వాలిటీ అన్నమయ్య కళాక్షేత్రం జైభారత్ ప్రతినిధులు పేర్కొన్నారు. తక్షణమే కూల్చివేసిన నిర్మాణాలను పునఃనిర్మించాలని డిమాండ్ చేశారు. హిందూస్ ఫర్ ప్లూరలిటీ అండ్ ఈక్వాలిటీ, అన్నమయ్య కళాక్షేత్రం, జైభారత్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి కాశినాయన భక్తి గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి, జైభారత్ జాతీయ ఉపాధ్యక్షుడు వంశీ, రాష్ట్ర అధ్యక్షుడు అరవింద్, నాయకులు గొల్లపల్లి గురవయ్య, కె.నాగభూషణం, రామయ్య మాట్లాడారు. కులమతాలకు అతీతంగా నిత్యం వేలాది మంది భక్తులచే పూజలందుకుంటున్న కాశిరెడ్డి నాయన క్షేత్రం నల్లమల్ల అటవీ ప్రాంత టైగర్ జోన్‌కు దగ్గరలో ఉందనే సాకుతో కేంద్రప్రభుత్వం అక్కడి నిర్మాణాలను కూల్చివేయడం సరైంది కాదన్నారు. దాతలు భక్తుల సౌకర్యార్థం నిర్మించిన ఆశ్రమ కట్టడాలైన గోశాల, పూలతోట, తొలగించడం సబబు కాదన్నారు. ఇప్పటికైనా పాలక ప్రభుత్వాలు త్వరితగతిన స్పందించి అటవీశాఖ అధికారులు ఇచ్చిన నోటీసులను తక్షణమే ఉపసంహరించుకునేలా చేయాలన్నారు. భక్తుల మనోభావాలు గౌరవించి కట్టడాలను పునర్‌నిర్మించాలని కోరారు.

న్యాయం జరగలేదంటూ...

కలెక్టరేట్‌లో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం - అడ్డుకున్న పోలీసులు

కడప కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తమకు నాలుగు నెలలైనా న్యాయం జరగలేదంటూ సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో నిర్వహించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిలో జాయింట్ కలెక్టర్ ఎదుట ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకుని పెట్రోల్ బాటిల్ లాక్కొని బయటకు తీసుకెళ్లడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చాపాడు మండలం నక్కలదిన్నెకు చెందిన బాధితుడు విశ్వనాథరెడ్డి బయట మీడియాతో మాట్లాడుతూ గతేడాది అక్టోబరులో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో తన భార్య శెట్టిపల్లి శివలక్ష్మికి ట్యూబెక్టమీ ఆపరేషన్ జరిగిందన్నారు. అయితే ఆపరేషన్ చేసిన డాక్టర్ ఇలియారాణి నిర్లక్ష్యంగా కారణంగా తన భార్య పేగుకు రంధ్రం పడటంతో ప్రాణాల మీదకు వచ్చిందన్నారు. సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చు చేసి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స చేయించి ప్రాణాలు కాపాడుకున్నామన్నారు. తనకు జరిగిన అన్యాయం మరొకరికి జరగకూడదంటూ మూడు నెలలుగా ఐఎంఏకు, కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌కు, డీఎం అండ్ హెచ్‌ఓకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. అయినా తమకు న్యాయం జరగలేదన్నారు. తన భార్యకు ఆపరేషన్ చేసిన డాక్టర్ ఇలియా రాణిపై చర్యలు తీసుకోవాలంటూ డీఎం అండ్ హెచ్‌ఓకు ఫిర్యాదు చేస్తే అవగాహన రాహిత్యం వల్ల, ఆపరేషన్ సమయంలో పేగుకు రంధ్రం పడిందని తప్పు జరిగుండొచ్చని డాక్టర్ ఇలియారాణిని కాపాడే విధంగా రిపోర్టు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ ఇలియారాణి భర్త డాక్టర్ రవికుమార్ కూడా స్కానింగ్ సెంటర్ నిర్వహిస్తూ తప్పుడు రిపోర్టులతో ప్రజలను మోసం చేస్తున్నారని, వీరందరిపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు విశ్వనాథరెడ్డి డిమాండ్ చేశారు.



కడప కలెక్టరేట్ సభాభవన్‌లో మీద పెట్రోల్ పోసుకున్న విశ్వనాథరెడ్డితో మాట్లాడుతున్న పోలీసులు



మీద పెట్రోల్ పోసుకున్న విశ్వనాథరెడ్డిని ఆసుపత్రికి తీసుకెళుతున్న పోలీసులు, తమకు జరిగిన అన్యాయం గురించి జేసీ అదితిసింగ్‌కు వివరిస్తున్న బాధితురాలు శివలక్ష్మి

డాక్టర్‌పై చర్యలకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు జేసీ ఫోన్

అనంతరం కలెక్టరేట్ సభాభవన్‌లో బాధితురాలు విశ్వనాథరెడ్డి భార్య శివలక్ష్మి ఫిర్యాదు మేరకు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజును పిలిపించి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. నాగరాజు వివరణ ఇస్తూ.. బాధితురాలి ఫిర్యాదు మేరకు గతంలో కమిటీ వేశామని, ఆ కమిటీలో గైనకాలజిస్టు, సర్జన్, రేడియాలజిస్ట్‌లు విచారణ చేసి రిపోర్టు ఇచ్చారన్నారు. ఆ నివేదికలను వెంటనే చర్యలకై డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు కూడా పంపినట్లు తెలిపారు. ఏదైనా సర్జరీలు జరిగితే 1 శాతం మేర వ్యత్యాసాలు జరగవచ్చన్నారు. ఆ విషయంపై తాను డాక్టర్‌ను వెనకేసుకొస్తున్నట్లు ఆరోపణలు చేయడం సరికాదని జేసీకి వివరణ ఇచ్చారు. అయినప్పటికీ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కమిషనరుకు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఫోన్ చేసి ట్యూబెక్టమీ చేసిన డాక్టర్ ఇలియారాణిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తప్పులు లేని ఓటరు లిస్టుకు సహకరించాలి

● ఈఆర్‌వో నీలమయ్య



అధికారులతో మాట్లాడుతున్న ఈఆర్‌వో నీలమయ్య

కమలాపురం రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేయడంపై దృష్టి పెట్టాలని కమలాపురం ఈఆర్‌వో నీలమయ్య తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీల నాయకుల సహకారంతో తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేస్తామన్నారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ, యువకులకు ఓటు హక్కు కల్పించాలని, ప్రతిఓటరు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయాలన్నారు. మృతి చెందిన, గ్రామాల్లో లేనివారిని, వివాహితులైన వారివి తొలగించాలన్నారు. ఇందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల తహసీల్దార్లు శివరామిరెడ్డి, సరస్వతి, లక్ష్మిదేవి, లక్షుమమ్మ, నాగేశ్వర్‌రావు, డీటీ అహల్య పాల్గొన్నారు.

కేఎస్ఆర్‌ఎంలో అవగాహన సదస్సు



చాంద్‌బాషాను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

సీకేదిన్నె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కేఎస్ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో మేధా సంపత్తి హక్కులపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఎంఎస్ఎంఈ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, కేఎస్ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ ఇండ్రస్ట్రియల్ జనరల్ మేనేజర్ చాంద్‌బాషా హాజరై కాపీరైట్, ట్రేడ్‌మార్క్‌లు, పేటెంట్లు, మౌలిక సూచనలపై అవగాహన కల్పించారు. ఐపీవో శైలజ, స్వప్న, కోఆర్డినేటర్లు హనుమంతరావు, గెస్ట్ ఫ్యాకల్టీ మహేష్‌పాటిల్, తదితరులు హాజరై విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో బీటెక్, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల సిబ్బంది, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

'పని ఒత్తిడిని తగ్గించండి'



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

వీరపునాయునిపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పని ఒత్తిడి తగ్గించాలని సచివాలయ పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీఓకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక వైపు సర్వేలు, మరో వైపు పంచాయతీ విధులతో సతమతమవుతున్నామన్నారు. ఉదయం 6గంటల నుంచి పని ప్రారంభిస్తే కుటుంబంతో కూడా గడిపేందుకు వీలు లేకుండా తమపై పనిఒత్తిడి పెరిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీ విధులను మాత్రమే చేసుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు.

ఆడపిల్లల శాతాన్ని పెంచాలి : ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో జాన్ ఇర్విన్

కడప కలెక్టరేట్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల శాతం తగ్గడం భవిష్యత్తులో మనిషి మనుగడకే ప్రమాదకరమని, ఆడపిల్లల శాతం పెంచేందుకు సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, ఎన్జీవోలు కృషి చేయాలని కడప రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఇర్విన్ ఆదేశించారు. కడపలోని ఆర్డీవో కార్యాలయం, థామస్ మన్రో మీటింగ్ హాల్లో ఆర్డీవో అధ్యక్షతన గర్భస్థ నిర్ధారణ పరీక్షల నిర్మూలనపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ లింగవివక్ష చూపే వారిపై కఠిన చర్యలు తప్పవని, బాలల నిష్పత్తిని గమనిస్తే బాలికల శాతం తక్కువగా ఉందన్నారు. అసమానతలను తొలగించి సమాజంలో ఆడపిల్లల శాతం పెంచాలన్నారు. స్కానింగ్ సెంటర్లలోనూ, ఆసుపత్రుల్లోనూ లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు చేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి సంఘటనలకు కారణమైన వారికి జైలు శిక్ష తప్పదన్నారు. లింగ వివక్షతను వ్యతిరేకిస్తూ ఫిర్యాదు చేసే వారికి పీసీఅండ్ పీఎన్‌డీటీ కమిటీ అండగా ఉంటుందని, ఆర్‌ఎంపీలు అబార్షన్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీసీఅండ్ పీఎన్‌డీటీ నోడల్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ రబ్బాని, సీఐ రామకృష్ణ, లీగల్ ఎక్స్‌పెక్ట్ మోహన్ క్రిష్ణ, డాక్టర్ డేవిడ్ చక్రవర్తి, డాక్టర్ బాలకృష్ణ, డెమో భారతి, ఎన్జీవోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ కోసం పోరాటం తప్పదు

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కోసం పెద్దఎత్తున పోరాటం చేయక తప్పదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం కడపలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబుకు రాయలసీమపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని చెప్పారు. తెలంగాణ అక్రమంగా ప్రాజెక్టులు కట్టినా, అప్పట్లో చంద్రబాబు ఓటుకు నోటు కేసు వల్ల ఒక్క మాట కూడా మాట్లాడలేని పరిస్థితి ఎదురైందని ఎద్దేవా చేశారు. రాయలసీమ ప్రజలను చంద్రబాబు తాకట్టుపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

రస్తాను ఆక్రమించారని ఫిర్యాదు

● కమిషనర్ దురుసుగా మాట్లాడారని బైటాయింపు

పులివెందుల రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో సర్వే నెంబర్ 231/4లోని ప్లాట్లలో రస్తాను ఆక్రమించారని పలువురు ప్రజలు మున్సిపల్ కమిషనర్ రాముడుకు వినతిపత్రం సమర్పించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు సిద్దారెడ్డి, బలరాం, ఓబులేసు తదితరులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో సదరు సర్వేనెంబరులో ఓ వ్యక్తి రస్తాను ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నారని, దీనిపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు పరిష్కారం కాలేదని తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు, వారికి మధ్య వాదనలు జరిగినట్లు తెలిసింది. దీంతో మున్సిపల్ కమిషనర్ దురుసుగా మాట్లాడారని మున్సిపల్ కార్యాలయంలో బైటాయించి నినాదాలు చేశారు. ఇదిలా ఉండగా లేఅవుట్‌కు మున్సిపల్ అప్రూవల్ లేదని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

కమిషనర్ ఏమన్నారంటే: ఈ ఘటనపై మున్సిపల్ కమిషనర్ రాముడును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా గతంలో జరిగిన విషయం తమకు తెలియదన్నారు. ప్లాట్లకు సంబంధించి మున్సిపల్ లేఅవుట్ ప్లాన్ తీసుకురమ్మని చెప్పామన్నారు. ఆ ప్లాన్ వారి వద్ద లేదన్నారు. 2019 నుంచి ఇప్పటికి సమస్య అలాగే ఉండడంతో పరిష్కారం ఎందుకు కాలేదని సాధారణంగా అడిగానన్నారు. దీంతో వారు సంబంధం లేని విషయాలపై మాట్లాడి ఎదురు ప్రశ్నించారన్నారు. ఏదేమైనా వారు వినతిపత్రం ఇచ్చారు సమస్యను పరిశీలిస్తామని కమిషనర్ వివరించారు.

ఉద్యోగ భద్రత కల్పించండి : ఆరోగ్యమిత్రలు



నిరసన కార్యక్రమంలో వైద్యమిత్రలు

కడప మారుతీనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న తమను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి తద్వారా కనీస వేతనం అమలు చేసి పుణ్యం కట్టుకోవాలని ఏపీ ఆరోగ్య మిత్ర కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు విజయ్, జాయింట్ సెక్రటరీ నాగార్జునరెడ్డి, డిప్యూటీ సెక్రటరీ సుబ్బరాజు, ట్రెజరర్ భవిత, వైస్ ప్రెసిడెంట్ కవితలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 17 ఏళ్లుగా సేవలందిస్తున్న తమకు అంతర్గత ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పాత కలెక్టరేట్‌లోని ఎన్టీఆర్ వైద్యసేవ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగి చనిపోయిన కుటుంబాలకు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద రూ.10 లక్షలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజ్ కల్పించాలన్నారు. ఈ విషయంగా సంబంధిత సీఈఓకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యమిత్రలు పాల్గొన్నారు.

నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యమా : ఏఐవైఎఫ్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

కడపసెవెన్ రోడ్స్ మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడాలని ఏఐవైఎఫ్ కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల నోడల్ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని మాయమాటలు చెప్పి నిరుద్యోగుల ఓట్లు దండుకుందన్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాల మెయిన్స్ ఎగ్జామ్ కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారని ఆవేదన చెందారు.

బాలిక అదృశ్యం



అదృశ్యమైన వసంత

కడప క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఫరీదానగర్‌కు చెందిన ఇంటర్మీడియట్ బాలిక అదృశ్యమైనట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. ఫరీదానగర్‌కు చెందిన గొడుగునూరు వసంత (17) వన్‌టౌన్ సర్కిల్ సమీపంలోని ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలలో చదువుతుంది. ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైనట్లు తెలిపారు. బంధువులు ఆమె కోసం వెతికినా ఆచూకి దొరకపోవడంతో బాలిక తండ్రి శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కడప మారుతీనగర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డీడీయూజీకేవై) పథకం ద్వారా అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ప్రతినిధి ఇంతియాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఆంధ్రప్రదేశ్ (ఎస్ఈఈడీఏపీ) సౌజన్యంతో నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. వివరాలకు 90630 82227 నెంబరును సంప్రదించాలని కోరారు.

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

కడప మారుతీనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సమస్యల విషయంగా ఈనెల 18వ తేది మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం జరుగనున్నట్లు కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏదేని సమస్యలను నివృత్తి చేసుకునే క్రమంలో జిల్లా ప్రజలు, ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు, సమస్యలను 9959225774 అనే నెంబర్‌కు ఫోన్ చేసిగానీ వాట్సాప్ ద్వారా గానీ తెలియజేయాలని కోరారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

● డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి

కడప నాగరాజుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కడప సమీపంలోని రామరాజుపల్లెలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కె.మునయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పాలెంపల్లె చంద్రగుప్తలు కోరారు. సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించారు. బిల్డప్ సర్కిల్ వైన్‌షాప్‌ల వద్ద స్పీడ్ బ్రేకర్ల మాదిరిగానే రామరాజుపల్లెలో ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని కోరారు.

కిరణ్మయి సేవకు ప్రశంసలు

కడప నాగరాజుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాలలో ఐఅండ్ఐ ఎన్జీఓ సంస్థ ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణలో శిక్షకురాలిగా కిరణ్మయి చేసిన సేవకు ప్రశంసలు దక్కాయి. ఏఐ టూల్స్, టీం బిల్డింగ్‌పై హైదరాబాద్‌లో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం జరిగింది. అక్కడ ఈమె సేవలను గుర్తించి మెమెంటోను బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎబినేజర్ చేతులమీదుగా బహుమతి అందించారు. స్టాఫ్ సెక్రటరీ ఆకుల రాజు, లక్ష్మీదేవి, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణదారులకు అదనపు సాయం

వీరపునాయునిపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పీఎంఏవై, ఎన్టీఆర్ అసంపూర్తి గృహ నిర్మాణదారులకు ప్రభుత్వం అదనపు సహాయం అందిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ తెలిపారు. సోమవారం గ్రామ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నిర్మాణదారులకు ఇస్తున్న సాయం కంటే అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అదనపు సాయం ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని లబ్దిదారులు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని కోరారు.

సీకేదిన్నె: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు సాయం అందిస్తున్నట్లు ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు పీఎంఏవై ఎన్టీఆర్ ప్రధానమంత్రి ఆవాస్ యోజన గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం ఈ తీపి కబురు అందించిందన్నారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణం కొరకు ఇస్తున్న రూ.1.80 లక్షలకు మరింత అదనపు సాయం అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గృహ నిర్మాణ లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్, ఇంజనీరింగ్ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

మహిళలకు శిక్షణ

సీకేదిన్నె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహిళా లబ్ధిదారులు టైలరింగ్ శిక్షణకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపీడీవో కుళాయిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ, కాపు, లబ్ధిదారులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద యూజర్ ఐడీ వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

విద్యార్థి మృతికి కారకులను శిక్షించాలి

● బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు

కడప మారుతీనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణ ప్రభుత్వ వసతి గృహం విద్యార్థి మృతికి కారకులను వెంటనే శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పాతరిమ్స్ వద్ద గల బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సదరు వసతి గృహంలో ఉంటూ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న అక్షయ అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. వసతి గృహంలో తగిన పర్యవేక్షణ లోపం కారణంగానే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని విమర్శించారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవడంతో పాటు చనిపోయిన ఆ విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం తగు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

బస్టాండ్‌ను ఉపయోగంలోకి తేవాలి

వేంపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.2.20 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రారంభించి, ప్రయాణికులకు ఉపయోగంలోకి తేవాలని వైసీపీ మండల కన్వీనర్ కల్లూరు చంద్రఓబుళరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం హజ్‌కమిటీ మాజీ సభ్యుడు మునీర్, యూత్ కన్వీనర్ రవిశంకర్‌గౌడ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కటిక చంద్రశేఖర్, కమతం రాజా, కృష్ణయ్యలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు పూర్తవుతున్నా బస్టాండ్ ఉపయోగంలోకి రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు.

సాంబశివారెడ్డిని తొలగించాలి : ఆర్ఎస్ఎఫ్

కడప నాగరాజుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్‌గా కొనసాగుతున్న బి.సాంబశివారెడ్డిని తొలగించాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసుయాదవ్ కోరారు. సోమవారం కడప గ్రీవెన్స్‌సెల్‌లో జిల్లా కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత లేకపోయినా అప్పటి డీఈఓను మేనేజ్ చేసి ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్‌గా నియామకమైనట్లు ఆరోపించారు. పూర్తి విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కోరారు.

సీడీపీఓపై చర్యలకై జేసీకి వినతి

కడప సెవెన్‌రోడ్స్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా కక్షసాధింపు ధోరణితో అంగన్వాడీ వర్కర్లను ఇబ్బంది పెడుతున్న చాపాడు సీడీపీఓపై చర్యలు తీసుకోవాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు మనోహర్ సోమవారం కలెక్టరేట్‌లో జేసీ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఐసీడీఎస్ పరిధిలో మైదుకూరు ప్రాజెక్టు జీవీ సత్రం సెక్టార్ గల్లావాల్లపల్లెలో అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తున్న శ్రావణిని ఫేక్ రిపోర్టు ఇచ్చి మెమోల పేరుతో మానసికంగా రాజకీయంగా కక్షసాధింపుల ధోరణితో ఇబ్బందులకు గురిచేస్తున్న చాపాడు సీడీపీఓపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఆర్పీల సమస్యలు సీఎం దృష్టికి

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం కడప నగరం ద్వారకానగర్ టీడీపీ కార్యాలయంలో ఆర్పీలు తమ సమస్యలు పరిష్కరించాలని శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరగా అందుకు ఆయన స్పందిస్తూ సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



ఆర్పీలతో మాట్లాడుతున్న టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



అధ్యాపకుల కృషి అభినందనీయం

సీకేదిన్నె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కేఎస్ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుల కృషి అభినందనీయమని కళాశాల ప్రిన్సిపల్ వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. కళాశాల ఆధ్వర్యంలో అధ్యాపకుల విశేష కృషికి పురస్కారాల పంపిణీ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశోధన, ప్రచురణలు, సర్టిఫికేషన్లు, విద్యా నైపుణ్యాల్లో విశేష ప్రతిభ కనపరచిన అధ్యాపకులకు అభినందనలు, ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. విద్యార్థులకు కొత్త అవకాశాలను అందిస్తూ ఈ పురస్కారాలు వారికి మరింత బాధ్యత, గౌరవాన్ని తీసుకొచ్చేందుకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కళాశాల ఎండీ చంద్రఓబుళరెడ్డి మాట్లాడుతూ గురువులు నాణ్యతతో కూడిన విద్యను అందించడమేకాక పరిశోధన, నవీన ఆవిష్కరణలో భాగస్వామ్యం కావడం ఎంతో అవసరమన్నారు. ఇలాంటి ప్రోత్సాహక బహుమతులు వారికి మరింత ఉత్సాహాన్ని అందిస్తాయన్నారు. మదనమోహన్‌రెడ్డి మాట్లాడుతూ జ్ఞానం అనేది పంచుకునే కొద్దీ పెరుగుతుందని, పరిశోధనల ద్వారా విజ్ఞానాన్ని విస్తరించడం నూతన ఆవిష్కరణలు తీసుకురావడం, అధ్యాపకుల కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వీఎన్‌ప్రసాద్, డీన్ డాక్టర్ ఎంవీ నారాయణ, అధ్యాపక బృందం పాల్గొని విజేతలను అభినందించారు.



బహుమతులు పొందిన అధ్యాపకులతో కళాశాల ఎండీ చంద్రఓబుళరెడ్డి (నాని), తదితరులు

పోరుమామిళ్ల పట్టణ శివార్లలో డ్రోన్ నిఘా



డ్రోన్ కెమెరాను పరిశీలిస్తున్న సీఐశ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి

పోరుమామిళ్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల పట్టణ శివార్లలో నిర్మానుష్యమైన ప్రదేశాల్లో డ్రోన్ నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డిలు తెలిపారు. సోమవారం సాయంత్రం పోరుమామిళ్ల పోలీసుస్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు పట్టణ శివారు ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం, గంజాయి తాగడం, పేకాట, ఈవ్‌టీజింగ్ తదితర నేరాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు. మద్యం, గంజాయి తాగి పట్టుబడితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. హెడ్‌కానిస్టేబుల్ దుర్గామోహన్ పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి

పోరుమామిళ్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేస్తామని ఆ సంఘం నేతలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డైరెక్ట్ సైనిక్ వెల్ఫేర్ ఆంధ్రప్రదేశ్ బ్రిగేడియర్ వెంకటరెడ్డి, జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి అబ్దుల్‌రజాక్ టీం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పోరుమామిళ్ల అమర్ జవాన్ మాజీ సైనిక అసోసియేషన్ మాజీ సైనికులతో వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మేజర్ కార్తీక్, ప్రెసిడెంటు సుబ్బరాయుడు, గౌరవాధ్యక్షులు కెప్టెన్ నారాయణ, జనరల్ కార్యదర్శి రుద్రవరం శ్రీనివాసులు,వైవీరెడ్డి, క్రిష్టారెడ్డి, బాల్‌రెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



అధికారులకు వినతి పత్రం అందిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగులు

బద్వేలుటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోషియేషన్ అధ్యక్షుడు శీలం గంగన్న కార్యదర్శి వెంకటలక్షుమ్మ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేసి రిటైర్డు ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. సంయుక్త కార్యదర్శి గురుమూర్తి, సత్యబాబు, గానుగపెంట హనుమంతరావు పాల్గొన్నారు.

లక్షలు వెచ్చించినా.. ఫలితం సున్నా

●కమీషన్ల కక్కుర్తి కోసం గత వైసీపీ హయాంలో రూ.80లక్షలతో గోదాముల నిర్మాణం ● నిరుపయోగంగా వదలివేసిన వైనం



గుట్ట ప్రాంతంలో రోడ్డు సౌకర్యం లేకుండా నిర్మించిన గోదాము



కానగూడూరులో నిరుపయోగంగా దర్శనమిస్తున్నగోదాము

దువ్వూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన నిర్మాణాలు కాంట్రాక్టర్లకు కల్పతరువుగా మారాయి. అప్పట్లో ప్రభుత్వ నిధులతో చేపట్టిన నిర్మాణాలు చాలా మేరకు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ తరహాలో రైతుల ప్రయోజనం కోసం అంటూ బహుళ ప్రయోజన సౌకర్య గోదాము పేరిట దువ్వూరు మండల పరిధిలో రెండు చోట్ల రూ.80 లక్షల నిధులు వెచ్చించి గోదాములు నిర్మాంచారు. రైతుల ప్రయోజనం దేవుడెరుగు. వాటిని నిరుపయోగంగా వదిలివేయడంతో రూ.80 లక్షల ప్రభుత్వ నిధులు బూడిదలో పోసినట్లు అయింది. ఇంత జరిగినా నాటి ప్రభుత్వం వాటిని రైతలకు వినియోగించకపోవడం శోచనీ యం. దువ్వూరు మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో నాబార్డు నిధులతో 2021 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం దువ్వూరు, కానగూడూరు ప్రాంతాల్లో గోడౌన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. వాటితోపాటు జిల్లాస్థాయిలో మరికొన్ని గోడౌన్ల నిర్మాణానికి ప్రభుత్వ పెద్దలు కమిషన్ల కోసం వారి అనుచరులకు వాటి నిర్మాణ బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. దువ్వూరు మండల విషయానికొస్తే రెండు చోట్ల నిర్మాణాలపై రైతులు అసహనం వ్యక్తం పరుస్తున్నారు. దువ్వూరు సమీప గుట్టల్లో ఒక గోడౌన్ నిర్మించారు. నిర్మాణం పూర్తికాకముందే ఒకవైపు గోడ బీటలు వారి పడేందుకు సిద్ధంగా ఉండడంతో జాగ్రత్తపడి ఆ భాగం తిరిగి అప్పట్లో పునర్నిర్మించినట్లు తెలుస్తోంది. ఇక్కడికి వెళ్లాలంటే దారి లేదు. రాళ్ల గుట్టలు, కంపచెట్లు దాటుకుంటూ వెళ్లాలి. కానగూడూరులో నిర్మించిన గోదాముపై భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2021-22 ప్రాంతంలో నిర్మించిన వాటిని ఉపయోగంలోకి ఎందుకు తేవడంలేదనే విషయం సమాధానం లేని ప్రశ్నగా మిగిలింది. కడప డీసీసీ బ్యాంకు పరిధిలోని ఈ గోదాముల కథ కంచి దారి పట్టకుండా రైతు ప్రయోజనాల బాట పట్టే విధంగా చర్యలు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. రూ.80 లక్షలతో నిర్మించిన ఈ రెండు గోదాములను అందుబాటులోకి తెస్తే లక్షలు వెచ్చించినా.. అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది.

సహకార సంఘానికి అప్పగిస్తే తదుపరి కార్యాచరణ చేపడుతాం

మండల పరిధిలో నిర్మించిన రెండు గోదాములను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి ఇప్పటికి అప్పగించలేదు. నాణ్యత లోపంతో నిర్మించారనే విషయం మా దృష్టికి వచ్చింది. ఏవైనా సమస్యలు ఉంటే మా పై అధికారుల దృష్టికి తీసుకెళుతాం. వీటిని మా పరిదిలోకి తీసుకున్న తర్వాత తదుపరి కార్యాచరణ చేపడుతాం.

- జె.రామమోహన్, సీఈవో, సింగిల్‌విండో సొసైటీ, దువ్వూరు

శివాలయం రోడ్డులో బస్ షెల్టర్ ఏర్పాటుకు చర్యలు



బస్ షెల్టర్ ఏర్పాటును పరిశీలిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణంలోని శివాలయం రోడ్డులో బస్సు స్టాప్ వద్ద ప్రయాణికుల నీడ కోసం బస్ షెల్టర్ ఏర్పాటుకు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున చర్యలు చేపట్టారు. సోమవారం మున్సిపల్ ఇన్‌చార్జ్ ఈఈ దస్తగిరి, డీఈ ప్రభాకర్ దాస్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నాగరాజు, టీపీవో చంద్రమోహన్‌లతో కలిసి కమిషనర్ సుధా హాలువద్ద రోడ్డుపై వున్న ఖాళీ స్థలంలో బస్ షెల్టర్ నిర్మాణానికి స్థల పరిశీలనతో పాటు అంచనాలు రూపొందించమని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేసవి ఎండలు దృష్టిలో పెట్టుకొని తాగునీటి కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక

రాజుపాలెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాజుపాలెం మండల పరిధిలో 1 నుంచి 6 గ్రేడ్ స్థాయిలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల సంఘనికి కమిటీని ఏకగ్రీవంగాఎన్నుకున్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధ్యక్షునిగా వెంకటయ్య, ఉపాధ్యక్షునిగా శీలం నిరంజన్‌రెడ్డి, కోశాధికారిగా నాగార్జున, మహిళా విభాగం అధ్యక్షురాలిగా కాంచన రామాంజనేయమ్మ, ప్రధాన కార్యదర్శిగా గణేశ్‌బాబు, సంయుక్త కార్యదర్శిగా మహేశ్, పవన్‌కుమార్, గౌరవ సలహాదారునిగా కొట్టె బాబు, ఫణీంద్ర, మునిరెడ్డి, చెండ్రాయుడు కార్యనిర్వాహక సభ్యులుగా బాలదస్తగిరిరెడ్డి, సతీష్, నవీన్‌కుమార్‌యాదవ్, నెపోలియన్, కుశల రెడ్డి, అంకాలయ్య, కపిరాజు ఎనుఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు పని ఒత్తిడి తగ్గించాలంటూ ఎంపీడీవో ఏవీ రమణారెడ్డికి వినతిపత్రం అందించారు.

అసంపూర్తిగా ఉన్న గృహాలను నిర్మించుకోవాలి

ఖాజీపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో అసంపూర్తిగా ఉన్న గృహాలను నిర్మించుకోవాలని ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఎస్టీలు 14, ఎస్సీ 97, బీసీ 106 గృహాలు ఏప్రిల్ 25వ తేదీలోపు పూర్తి చేస్తే వారికి ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు అందుతుందన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే సీఎం లక్ష్యం



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సొంతింటి కళను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెరవేర్చుతాడని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు సంబంధించిన కార్యకర్తలు, ఇతరులతో ఆయన సమావేశమై మాట్లాడారు. 2019-24 సంవత్సరంలో ఇళ్లకు సంబంధించి ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీ కులాలకు రూ.50 వేలు, ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐఎల్ చిన్న, పొన్నతోట మల్లి, బ్రిరు సంతోష్ పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

జమ్మలమడుగు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో సోమవారం రాత్రి పేద ముస్లింలకు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. రంజాన్ మాసం పురష్కరించుకుని స్థానిక నాయకులు వెంకటేశ్వర కాలనీకి చెందిన కొమెర్ల జాకీర్ ఏర్పాటు చేసిన రంజాన్ తోఫాను భూపేశ్‌రెడ్డి హాజరై అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటరామిరెడ్డి, కొమెర్ల మోదీన్, షేక్షావలిలున్నారు.

మాదకద్రవ్యాలను నిర్మూలిద్దాం



మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాలను వివరిస్తున్న సీఐ రమణారెడ్డి

ప్రొద్దుటూరు,మార్చి17 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తును దెబ్బతీసే మాదక ద్రవ్యాలను నిర్మూలించేందుకు ప్రతి పౌరుడు నడుం బిగించాలని త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక వైఎస్‌ఆర్‌ఇంజనీరింగ్ కళాశాలలో పోలీసు కళాజాత ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్యాక్షన్ జోన్ సీఐ రమణారెడ్డి మాట్లాడుతూ కళాశాల పరిసరాల్లోకానీ చుట్టుపక్కల గానీ ఎవరైనా మత్తు పదార్థాలు సేవిస్తున్న విక్రయిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా పోలీసు కళాజాత మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలపై వేసిన నాటకం విద్యార్థులను ఆలోచింపజేసింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి త్రీటౌన్‌ఎస్ఐ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

హౌసింగ్ లబ్ధిదారులకు సాయం

చాపాడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా ఆర్థికసాయం అందజేస్తున్నట్లు ఎంపీడీవో వీరకిశోర్, హౌసింగ్ ఏఈ ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. 2019-24 సంవత్సరాల్లో కొత్తగా ఇళ్ల మంజూరై అసంపూర్తి నిర్మాణంలో ఉన్న వాటికి మాత్రమే సహాయం చేస్తున్నట్లు వారు చెప్పారు. బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు చొప్పున, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున ఇస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 25 తేదీలోపు ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని వారు కోరారు.

అగ్నికి ఆహుతి అవుతున్న కొండ

ఖాజీపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా నాగనాదేశ్వరుని కొండ అగ్నికి ఆహుతి అవుతోంది. ఫారెస్టు అధికారులు మాత్రం రెవెన్యూ సంబంధించిందని, ఫారెస్టులోకి ఈ ప్రాంతం రాదని అంటున్నారు. ఏది ఏమైనా ఆ ప్రాంతం తగలబడిపోతుండడంతో వన్యప్రాణులు, పక్షులు, ఇతరత్రా జీవులు కాలిపోతున్నాయి. ప్రతి సంవత్సరం ఈ కొండ ఇలాగే కాలిపోతోందని స్థానికులు వాపోతున్నారు. కడప-కర్నూలు జాతీయ రహదారికి అతి సమీపంలో కొండ కాలుతుండడంతో వాహనదారులు ఆపి ఫొటోలు తీసుకుంటూ కొండ పొడవునా కాలుతోంది చూడు అంటూ చర్చించుకుంటుండడం గమనార్హం.

అంగన్వాడీలో గర్భిణులకు సామూహిక సీమంతాలు



ప్రొద్దుటూరు టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సూపర్‌బజార్‌రోడ్డులోని అంగన్వాడీ సెంటర్‌లో ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. సోమవారం 20 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవాధ్యక్షుడు చిప్పగిరి ప్రసాద్, టీవీఎస్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు టీవీ సుబ్బారావు మాట్లాడుతూ తల్లికి సమాజంలో ఎంతో విలువ ఉందని పేర్కొన్నారు. న్యాయవాది జయలక్ష్మి, అర్బన్ సీడీపీవో హైమావతి పాల్గొన్నారు.

ఆయాతోనే అంగన్వాడీ కేంద్రం నిర్వహణ

జమ్మలమడుగు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కన్నెలూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ వర్కర్‌లేక ఆయాతోనే నిర్వహిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఒకవైపు మధ్యాహ్నం వంట తయారు చేయడం పిల్లలను ఇంటి నుంచి పిలుచుకుని వచ్చి మళ్లీ వదలిపెట్టడం కష్టతరంగా ఉందన్నారు. అంగన్వాడీ కేంద్రంలో 20 మందికిపైగా ఉండగా ప్రస్తుతం 15 మంది ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అంగన్వాడీ కార్యకర్త పోస్టు భర్తీ చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై జమ్మలమడుగు సీడీపీవో రాజేశ్వరి దేవిని వివరణ కోరగా అంగన్‌వాడీ వర్కర్ రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడిందని తెలిపారు. వీలైనంత త్వరలో అక్కడ అంగన్‌వాడీ పోస్టు భర్తీచేస్తామని ఆమె పేర్కొన్నారు.

అశ్వవాహనంపై శ్రీనివాసుడు

బద్వేలు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని లక్ష్మీపాలెంలో వెలసిన లక్ష్మీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అశ్వవాహనంపై వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభాగ్యుడిని అక్కున చేర్చుకున్న వివేకానంద సేవాశ్రమం



అభాగ్యుడు జనార్దన్‌తో ఆశ్రమ నిర్వాహకుడు

కాశినాయన మార్చి17(ఆంధ్రజ్యోతి): ఓ అభాగ్యుడిని సోమవారం ఓబుళాపురం సమీపంలోని వివేకానంద సేవాశ్రమం అక్కున చేర్చుకుంది. కడప పట్టణంలోని శాటిలైట్ కాలనీలోని పరిసరాల్లోని ఓచిన్న ఇంటిలో ఓవృద్ధురాలు ఇద్దరు కొడుకులతో కలిసి జీవిస్తుంది. నెల రోజుల క్రితం వృద్ధురాలు ఇంట్లోనే మృతి చెందింది. మూడు రోజు లుగా ఆరు బయట తిరిగే కొడుకులు కన్పించకపోవడం ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో ఇరుగు పొగురు వారు పోయి తలుపులు తెరిచి చూడగా తల్లి శవం పక్కనే చిన్న కుమారుడు ఉరివేసుకొని చనిపోయిఉన్నాడు. పెద్దకుమారుడు జనార్ధన్ శవాల పక్కన కూర్చోని ఉన్నాడు. మున్సిపాల్టివారికి సమాచారం ఇవ్వడంతో దహన సంస్కారాలు చేశారు. తల్లిని తమ్ముడిని కోల్పోయిన జనార్ధన్ మౌనంలోకి వెళ్లిపో యాడు. చెన్నూరు బస్టాండు సమీపంలోని రామక్రిష్ణ మఠం బయట కూర్చోని ఉంటాడు. ఎవరైనా ఏదైనా పెడితే తింటాడు. ఇతని విషయాన్ని వివేకానంద సేవాశ్రమానిక స్థానికులు సమాచారం ఇవ్వడంతో నిర్వాహకులు రామ తులసి, వ్యవస్థాపకుడు రామక్రిష్ణారెడ్డి ఆశ్రమాని తీసువచ్చే సపర్యలు చేసి చోటుకల్పించారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం



పరీక్షలకు హాజరైన విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుంచి 12.45 వరకు పరీక్ష నిర్వహించారు. మొదటి రోజు తెలుగు, సంస్కృతం, ఉర్దూ బాషా పరీక్ష నిర్వహించారు. ప్రొద్దుటూరు మండలంలో 3,770 మంది విద్యార్థులు ఉండగా 3,758 మంది విద్యార్థులు హాజరయ్యారు. 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షను పురష్కరించుకుని విద్యార్థులు, తల్లిదండ్రులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్డీవో



పరీక్షా కేంద్రాన్నితనిఖీ చేస్తున్న బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్

బద్వేలు/రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బద్వేలులోని పదో తరగతి పలు పరీక్షా కేంద్రాలైన ఫాతిమా, నారాయణ ఇంగ్లీషు మీడియం పాఠశాలలను బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ తనిఖీ చేశారు. అక్కడి పరీక్షా కేంద్రంలో వసతుల గురించి అడిగి తెలుసుకుని, విద్యార్థులకు ఎలాంటి సమస్య లేకుండా చూశారు. మొదటి రోజు పరీక్ష నిర్వహణ, ఇన్విజిలేటర్ల పనితీరును పరిశీలించి సిబ్బందికి తగుసూచనలు ఇచ్చారు. పది పరీక్ష కేంద్రాల్లో 1850 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 10 మంది గైర్హాజరయ్యారు. ఆయాపరీక్షల కేంద్రాల్లో అర్బన్ సీఐ రాజగోపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

జమ్మలమడుగు/ కొండాపురంలలో: డివిజన్ కేంద్రమైన జమ్మలమడుగు పట్టణంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 10 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షా కేంద్రాల్లో 1507 మంది విద్యార్థులకు గాను 1492 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద డీఎస్పీ వెంకటేశ్వరరావు, అర్బన్ సీఐ లింగప్ప ఆధ్వర్యంలో పోలీసు మొబైల్ వాహనంతో గస్తీ తిరిగారు. కొండాపురం మండలంలో సోమవారం నుంచి ప్రారంభమయిన పదో తరగతి పరీక్షలకు నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో ఓబులేసు తెలిపారు. మూడు పరీక్షా కేంద్రాలలో 457 మంది గాను 453 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు ఎస్సై విద్యాసాగర్ తెలిపారు.

ఎర్రగుంట్లలో: పది పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కావడంతో పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉదయం 8గంటలకు చేరుకున్నారు. విద్యార్థులను తనిఖీ చేసి కేంద్రాలలోనికి అనుమతించా రు. మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాల్లో 780మంది విద్యార్థులు పది పరీక్షలు రాస్తున్నారు. ఇందులో నలుగురు విద్యా ర్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

బి.కోడూరులో: బి.కోడూరు కేంద్రంగా నిర్వహించిన పదో తరగతి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 161 మంది విద్యార్థులకు గాను 161మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దారు దస్తగిరయ్య, ఎంపీడీఓ భాస్కర్‌రావు పరిశీలించారు. విద్యార్థులకు తాగునీరు, ప్రథమ చికిత్స కిట్‌లు అందుబాటులో ఉంచారు.

అట్లూరులో: మండలంలోని కేజీబీవీలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు కేంద్రం చీఫ్ హరికొండయ్య తెలిపారు. మొత్తం విద్యార్థులు 178 మంది హాజరైనట్లు తెలిపారు. అట్లూరు ఎస్ఐ రామక్రిష్ణ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముద్దనూరులో: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన పదోతరగతి పరీక్ష ప్రశాంతంగా జరిగింది. బాలుర, బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాలలో మొదటి రోజు తెలుగు పరీక్షకు 288 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు ఏవో వెంకటకృష్ణారెడ్డి తాగునీరు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో నాగేశ్వరనాయక్ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీల వెల్లువ



ప్రజల నుంచి అర్జీలు తీసుకుని పరిశీలిస్తున్న అధికారులు

జమ్మలమడుగు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి అర్జీలు వెల్లువలా వచ్చాయి. తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో వివిధ సమస్యలకు సంబంధించి ప్రజలు అర్జీలు అందజేశారు. మండలస్థాయి అధికారులు, కిందిస్థాయి సిబ్బంది, వీఆర్వోలు కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని పెద్దదండ్లూరు గ్రామం సున్నపురాళ్లపల్లె రేషన్‌షాపులకుగాను ఎండీయూ ఆపరేటర్ సరిగా లేరని ప్రజలకు నిత్యావసర సరకుఉలు ఇబ్బందిలేకుండా సరఫరా అయ్యేలా చూడాలని వినతి పత్రం అందజేశారు. అలాగే ఎస్.ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతులు పొలాలు ఆన్‌లైన్‌లో తమ పేర్లపై లేవని గతంలో అధికారులు అలా చేశారని ప్రస్తుతం ఆన్‌లైన్‌లో మార్చి తమకు న్యాయం చేయాలని విన్నవించారు. గూడెం చెరువు గ్రామంలో ఇంటి స్థలాలకు సంబంధించి ఆక్రమణపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సైదున్నీసా, ఉపాధి హామీ అధికారిణి పద్మ, సచివాలయ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతగా చిరువ్యాపారుల క్షీరాభిషేకం



ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న చిరు వ్యాపారులు

మైదుకూరు రూరల్ ,మార్చి17(ఆంధ్రజ్యోతి) :స్థానిక రాయల్ సర్కిల్‌లో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ కు కృతజ్ఞతలు తెలుపుతూ సోమవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు యాపరాల చిన్న ఆధ్వర్యంలో తోపుడు బండ్ల వ్యాపారులు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ 2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని దినసరి మార్కెట్ వేలం పాటలో తోపుడు బండ్లకు మినహాయింపు ఇస్తామని చెప్పడం జరిగింది. ఆమేరకు ఇటీవల జరిగిన మార్కెట్ వేలం పాటలో ఆదేశాలు జారీ చేశారు.మార్చి 1వ తేదీ నుంచి తోపుడుబండ్లకు గేటు రుసుము ఎవ్వరు చెల్లించాల్సిన పనిలేదని అధికారులు కూడా ప్రకటనలు చేశారు. దీంతో హర్షం వ్యక్తం చేసిన చిరువ్యాపారులు ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేయడంతో పాటు కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బురగోళ్ల చిన్న, తుపాకుల రమణ, సారధి, రామిశెట్టి కిర ణ్, బెల్లం బుజ్జి, చిరువ్యాపారులు పాల్గొన్నారు.

సోమిరెడ్డిపల్లెలో తాగునీటికి బోరు ఏర్పాటు



తాగునీటి బోరు వేస్తున్న టీడీపీ నేతలు

బ్రహ్మంగారిమఠం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారిమఠం మండలంలోని సోమిరెడ్డిపల్లె సచివాలయం వద్ద ప్రజలకు నీటి సౌకర్యం కోసం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాలతో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి సోమవారం నూతన బోరు వేయించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు వెల్లటూరు సాంబశివారెడ్డి, శివాయాదవ్, మేకల సుధాకర్‌యాదవ్, చిలమల నాగయ్య, శ్రీను, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్, పంచాయతీ సెక్రటరీ ప్రభాకర్ పాల్గొన్నారు.

మండల అభివృద్ధే ఎమ్మెల్యే లక్ష్యం : బ్రహ్మంగారిమఠం మండల అభివృద్ధే ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ లక్ష్యమని బి.మఠం మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం మండలానికి నవోదయ పాఠశాల మంజూరు చేయించారని, నియోజకవర్గంలోని అత్యంత వెనుకబడిన మండలం బ్రహ్మంగారిమఠం మండలం అని, ఈ మండలాన్ని ఎమ్మెల్యే అభివృద్ధి బాటలో తీసుకుపోవడానికి కృషి చేస్తున్నారని అన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

బద్వేలు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నిక ల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పా ర్టీ జిల్లా నాయకులు చంద్రశేఖర్, చంద్రమోహన్‌రాజులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలలో ఉచిత పథకాన్ని ఆర్థిక పరిస్థితి బాగాలేదని ఆలస్యం చేయడం తగదన్నారు. ఇది ప్రభుత్వానికి ఎంత మాత్రం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఐ ఎంఎల్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.